
# మిసిమి

మాస పత్రిక

జూన్ 1993

వెల రూ. 5/-




మహాకవి శ్రీశ్రీ మహాప్రస్థానమంది,
పది సంవత్సరాలైన సందర్భంగా,
'పతితులార, భ్రష్టులార,
బాధాసర్పదష్టులార,
ఏడవకండేడవకండి!'

# మిసిమి

**"All that we are is the product of what we have thought," is "We are what we think." – Dammapada.**

సంపుటి 4 | జూన్ 1993 | సంచిక 11

సంపాదకుడు: రవీంద్రనాథ్ ఆలపాటి

## విషయసూచిక


తత్వాన్ని విశ్వజనీనం చేయగలమా? – డా. కె. సచ్చిదానంద మూర్తి

ప్రేమించడం ఒక కళ – అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి

ప్రకృతి పింఛం విప్పింది - సైన్స్ దుర్భిణి వేసింది – ఎన్. ఇన్నయ్య

స్వప్న శిల్పము – ధ్వని – డాక్టర్ జి.వి. కృష్ణరావు

నెహ్రూ – గాంధీ సంస్థానం – మాకినీడి సూర్య భాస్కర్

ధోరణి – డా. సంజీవ దేవ్


విడిప్రతి రూ. 5/- వార్షిక చందా రూ. 60/-

ముఖచిత్రం

Christ and repentant Sinners

1616 - 18

# LIVING DICTIONARY
## (DEVIL'S DICTIONARY)

*Compiled by*
AMBROSE BIERCE (1911)

**Heathen,** *n.* A benighted creature who has the folly to worship something that he can see and feel. According to Professor Howison, of the California State University, Hebrews are heathens.

**Heaven,** *n.* A place where the wicked cease from troubling you with talk of their personal affairs, and the good listen with attention while you expound your own.

**Hebrew,** *n.* A male Jew, as distinguished from the Shebrew, an altogether superior creation.

**Hemp,** *n.* A plant from whose fibrous bark is made an article of neckwear which is frequently put on after public speaking in the open air and prevents the wearer from taking cold.

**Hermit,** *n.* A person whose vices and follies are not sociable.

**Hippogriff,** *n.* An animal (now extinct) which was half horse and half griffin. The griffin was itself a compound creature, half lion and half eagle. The hippogriff was actually, therefore, only one-quarter eagle, which is two dollars and fifty cents in gold. The study of zoology is full of surprises.

**Historian,** *n.* A broad-gauge gossip.

**History,** *n.* An account mostly false, of events mostly unimportant, which are brought about by rulers mostly knaves, and soldiers mostly fools.

**Homoeopathist,** *n.* The humorist of the medical profession.

**Homoeopathy,** *n.* A school of medicine midway between Allopathy and Christian Science. To the last both the others are distinctly inferior, for Christian Science will cure imaginary diseases, and they can not.

**Homicide,** *n.* The slaying of one human being by another. There are four kinds of homicide: felonious, excusable, justifiable and praiseworthy, but it makes no great difference to the person slain whether he fell by one kind or another - the classification is for advantage of the lawyers.

**Homiletics,** *n.* The science of adapting sermons to the spiritual needs, capacities and conditions of the congregation.

**Honorable,** *adj.* Afflicted with an impediment in one's reach. In legislative bodies it is customary to mention all members as honorable; as, "the honorable gentleman is a scurvy cur."

**Hospitality,** *n.* The virtue which induces us to feed and lodge certain persons who are not in need of food and lodging.

**Hostility,** *n.* A peculiarly sharp and specially applied sense of the earth's over-population. Hostility is classed as active and passive; as (respectively) the feeling of a woman for her female friends, and that which she entertains for all the rest of her sex.

**Houri,** *n.* A comely female inhabiting the Mohammedan Paradise to make things cheery for the good Mussulman, whose belief in her existence marks a noble discontent with his earthly spouse, whom he denies a soul. By that good lady the Houris are said to be held in deficient esteem.

**Humanity,** *n.* The human race, collectively, exclusive of the anthropoid poets.

**Humorist,** *n.* A plague that would have softened down the hoar austerity of Pharaoh's heart and persuaded him to dismiss Israel with his best wishes, cat-quick.

# తత్వాన్ని విశ్వజనీనం చేయగలమా?

– డా. కె. సచ్చిదానంద మూర్తి

ప్రాచ్య నాగరికత, సంస్కృతి అనిగాని, పాశ్చాత్య నాగరికత, సంస్కృతి అనిగాని ఎక్కడా లేవు. ఉన్నవల్లా, భారతీయ, చైనా, జపాన్, ఫ్రెంచ్, స్పానిష్, జర్మన్, ఇరానియన్, అరబిక్ నాగరికతలు, సంస్కృతులే. పాశ్చాత్య, యూరోప్ తత్వం అనేదేమీ లేదు. యూరోప్, ఆసియా, అమెరికా ఖండాలలోని వివిధ దేశాలలో రూపొందిన అనేక తత్వాలున్నాయి. భారతీయ, చైనా తత్వం అనేవి కూడా లేవు. చైనాలో, భారతదేశంలో, ప్రాచ్య దేశాలలో అనేక తత్వాలు పుట్టి, వికసించాయి. అలాగే యూరోప్‌లోనూ జరిగింది. ప్రపంచంలోని నాగరికతలు, సంస్కృతులు, తాత్విక, వైజ్ఞానిక భావాలు పరస్పరం ప్రభావం చూపెట్టాయి, మిళితమయ్యాయి. కొన్నిసార్లు కొత్త సమన్వయీకరణలకు దారి తీశాయి. దేశం, జాతి, ఏదీ కూడా వైజ్ఞానిక, తాత్విక, మతరీత్యా గాని, నైతిక పరంగాగాని ప్రపంచ నాయకత్వం వహించలేదు. ప్రతి దేశంలోనూ మేధస్సు గలవారు, సమర్థులు, కష్టించి కృషి చేసేవారు ఏదో ఒక రకమైన సత్యాన్ని కనుగొనగా, అది మానవజాతి ఉమ్మడి ఆస్తి అవుతూ వచ్చింది. ఏది సరైనది, ఏది దోషపూరితం, నీతిగా వుండడంఎలా, అధ్యాత్మికతలో జీవనం సాగించడం ఎలా అనేది అన్ని కాలాల్లో ప్రజలందరికీ తెలుసు. అయితే వీటికి సంబంధించిన లోతుపాతులు, గుణాల వరకూ ప్రజల్లో, వ్యక్తుల్లో చాలా తేడాలున్నాయి.

ఇదిలా వుండగా, తాత్వికోద్యమం, వైజ్ఞానిక సంప్రదాయం, గ్రీక్ నాగరికతలో మాత్రమే చెట్టా పట్టా వేసుకొని సాగగా, యీ ద్వంద సంప్రదాయమే పాశ్చాత్య నాగరికతను మలచిందని పాశ్చాత్యులు భావిస్తున్నారు. (చూడు బెర్ట్రాండ్ రసెల్, విజ్‌డం ఆఫ్ ది వెస్ట్, తుది పలుకు, ప్రీమియర్ బుక్స్, న్యూయార్కు 1964 పుట 405). తత్వం, విజ్ఞానం చేతులు కలిపి పయనించినట్లు చరిత్ర రుజువు చేస్తున్నదా? పాశ్చాత్య నాగరికతలో, యిలా చెట్టాపట్టా వేసుకోవడమంటే ఏమిటి? పరస్పరం ఒకదానిని గురించి మరొకటి తెలుసుకొని, ఖండించుకోకుండా, సమన్వయంగా పోవడం అని భావన కావచ్చు. ఒక రంగంలో జరగాల్సిన కృషిని మరొకరు చేబట్టకపోవచ్చు. తాత్వికం, వైజ్ఞానికం అంటే ఏమిటో యిరువురూ అవగాహన చేసుకొని, ఒకరి పరిధిలోకి మరొకరు రాకుండా వుండాలి. ఎవరి పరిమితుల్ని వారు గ్రహించాలి. అలా కాకుంటే, తత్వాన్ని వైజ్ఞానికంగానూ, విజ్ఞానాన్ని తాత్వికంగానూ చేసే ప్రయత్నం సాగవచ్చు. మతం-తత్వం; అధ్యాత్మికత-తత్వం కలసి పయనించాలనడం లోనూ గందరగోళం ఏర్పడవచ్చు. భారతీయతత్వం ఆచరణాత్మకమనీ, అధ్యాత్మికమనీ, పాశ్చాత్యమంతా భౌతికం, వూహాపోహలమయమనీ కొందరు భారతీయులంటున్నారు. పాశ్చాత్య లోకంలో చాలా (మత) అధ్యాత్మిక చింతన వుండగా, భారతీయ తత్వంలో వైజ్ఞానిక, భౌతిక చింతన అలాగే కనిపిస్తుంది.

# II

ఇంతకూ తత్వం అంటే ఆమోద యోగ్యమైన భావన ఏమిటి? రెండు మహోన్నత ఉదాహరణలు గమనిస్తే, సోక్రటీస్, కన్ఫ్యూసియస్‌లను తాత్వికులనడంలో ఎవరూ అభ్యంతర పెట్టరు. సత్యాన్వేషణ నిరంతరం సాగించడమే తన పని అని సోక్రటీస్ ప్రకటించాడు. వూపిరివున్నంతవరకూ తత్వంలో మునిగి తేలుతానన్నాడు. ఎవరు ఎదురైనా సరే - ''సంపద, కీర్తిపై దృష్టి పెట్టి, వివేచన, సత్యాన్ని పెడచెవిని పెట్టడానికి సిగ్గేయడం లేదా? నిన్ను నీవు మెరుగుపరచుకునే ప్రయత్నం చేసుకోవా?'' అని అడుగుతానన్నాడు సోక్రటీస్. (బరి, ఎ హిస్టరి ఆఫ్ ఫ్రీడం ఆఫ్ థాట్, రాధాకృష్ణన్ తన రెలిజియన్ అండ్ సొసైటీలో ప్రస్తావించాడు. పుట 60).

కన్ఫ్యూసియస్ శిష్యుడు జెంగ్‌జూ పేర్కొన్నట్లు, తన గురువు బోధనలలో ఒకే ఒక విషయం అంతర్లీనంగా సాగింది. తాను ఎలా పెంపొందాలనుకుంటాడో అలాగే ఇతరులను పెంపొందించే ప్రయత్నం చేయడమే యీ కృషి సారాంశం. తననూ, ఇతరులనూ ఒకే స్థితిలో చూడడం పేర్కొన దగిన అంశం. తన కోర్కెలు, ఆదర్శాలు గమనిస్తే, ఇతరులపట్ల ప్రవర్తన కూడా స్పష్టపడుతుంది. తనకు అప్రియమైనది ఇతరులకు చేయక పోవడం ఇందులో గమనార్హం. పరస్పరం ఇచ్చి పుచ్చుకునే తీరు చూడవచ్చు. ధర్మాన్ని పాటించే వారు ఇతరులపై ప్రభావం చూపుతారు. ధర్మం అనేది మనిషి ప్రత్యేక లక్షణంగా కన్ఫ్యూషియస్ భావించాడు. మానవత్వాన్ని పెంపొందించడానికి యీ ధోరణి క్రమేణా వికసింప జేసుకోవాలన్న మాట. చిత్తశుద్ధి, సూటిగా చెప్పడంలోనూ, మాటలు, ప్రవర్తనలోనూ సరైన ధోరణి వ్యక్తమౌతుంటుంది. ఆచార, అభిరుచులలో కర్మకాండలో ఔచిత్యంలో యివి బయటపడతాయి. సమాజంలో భాగంగా వుండడానికి, కట్టుబాట్లు పాటించడానికి, తన అహాన్ని అధిగమించడానికి పై విషయాలు తోడ్పడతాయి. ఉద్వేగాలు, భావనలు ఎలా వుండాలో శిక్షణ యిస్తాయి. వాటిని వ్యక్తం చేసే సరైన పద్ధతి కూడా నేర్పే తీరు యిందులో వున్నది. (ఫార్ ఈస్టరన్ ఫిలాసఫీస్ 2వ అధ్యాయం చూడు)

భారతదేశంలో తాత్విక ధోరణులకు, కొన్ని ఉదాహరణలు చూద్దాం.

మనస్సు దేనినిబట్టి తన లక్ష్యాన్ని చేరుతుంది? జీవశక్తి తన విధిని ఎలా నిర్వర్తిస్తున్నది? దేనివలన మాట్లాడగలుగుతున్నాం? కన్నులు, చెవులు అప్పగించగలుగుతున్నాం? అదే మూలానికి మూలమైన మనస్సు, జీవశక్తి, ఇంద్రియాలు, మనస్సుతో బంధ విముక్తులైన వివేకులు, బాహ్య ప్రపంచానికి దూరంగా వుండగలుగుతున్నారు. వారే అమరులౌతారు. (కేనోపనిషత్తు 1-2) మనస్సును సూక్ష్మజీవిపై కేంద్రీకరించి, దైవంపై ధ్యానం చేస్తూ వారు సౌఖ్యాలను, దుఃఖాలను త్యజిస్తారు. ఆత్మకు చావు పుట్టుకలు లేవు. అది దేని నుండీ జనించదు. దానినుండి ఏదీ జనించదు. అది శాశ్వతం, నాశనం లేనిది. శరీరంలో వున్న దానికి చావు లేదు. అందరిలోనూ సూక్ష్మరూపంలో ఆత్మ వుంది. కోర్కెలు లేనివాడు దుఃఖాలను అధిగమించి, ఆత్మను గ్రహిస్తాడు (కఠో పనిషత్తు 12, 18, 20) బ్రహ్మను తెలిసినవాడు అనంతాన్ని సాధించినట్లే. బ్రహ్మే సత్యం, జ్ఞానం, అనంతం. బ్రహ్మ జ్ఞాని దేనికీ భయపడడు. (తైత్తరీయో పనిషత్తు(II. I.I; II. IV. I) బ్రహ్మను తెలిసిన వాడు బ్రహ్మలో లీనమౌతాడు. (ముండకోపనిషత్తు 111. 2. 9).

ష్రోడింగర్ దృష్టిలో అందరికీ చెందిన తాత్విక చింతన అంటే, మనం ఎవరం? అనే ప్లోటినస్ వేసిన ప్రశ్నే. ఉపనిషత్తులు, ఛూసి (చైనా తాత్వికుడు) తమ ధోరణిలో యీ

ప్రశ్నలకు సమాధాన మిచ్చారు. మార్పు అన్ని చోట్లా వున్నది. క్రమత్వంతో కూడిన మార్పు అది. విశ్వ వ్యాప్తమైన యీ మార్పు, పరస్పర విరుద్ధ సూత్రాలకు లోబడి పనిచేస్తుంటుంది. ఇది కాల క్రమంగా పరమార్థానికి అనుగుణంగా జరుగుతుంటుంది. అన్ని రీతులు కూడా ఒకే విశ్వజనీన సూత్రానుగుణంగా సాగుతుంటాయి. భూమ్యాకాశాలలో వుండేదంతా బహుళత్వాన్ని సంపూర్ణంగా చూపే మర్మమే. విశ్వం అంతా వాస్తవమనీ, ఇందలి పరస్పర సంబంధాలన్నీ పదార్థమయాలనీ ఛూసి పేర్కొన్నాడు. ఇది వ్యవస్థీకృత సూత్రాం. దీని అంతర్లీన సూత్రమే పరమార్థం. మానవుడితో సహా అన్నిటా యీ సూత్రం గర్భితమై వుంది.

ఇది ఒక్కటే అయినా, అన్నిటా కనిపిస్తుంది. ఒకే చంద్రుడు అన్ని నదుల్లో సరస్సుల్లో ప్రతిబింబించనట్లున్న మాట. ఇది అనంతం, ఆకారం లేనిది. ఇది ప్రశాతంగానూ, చైతన్యం గానూ వుంటుంది. విశ్వశక్తులన్ని యిది ప్రేరేపిస్తుంది. ఇదెలా జరుగుతుందో తెలియదు. మనుషులలోని అన్ని వస్తువులలోని పరమార్థం అత్యున్నత మంచితనమే. ఇది అన్నిటికి మించి, అన్నిటిలోనూ వుంటుంది. క్రమమైన మార్పుకు యిదే కారణం (చూడు నా ఫార్ ఈస్టరన్ ఫిలాసఫీస్ 37, 45, 82-3 పుటలు)

## III

విశ్వమంతా వివేచనాత్మకమైన శక్తి లేదా మనస్సు పాలిస్తున్నదనే అర్థం వచ్చే ఈజిప్టు చెక్కడాలు లభించాయి. చారిత్రకంగా చూస్తే, తాత్విక భావాన్ని చూపే యీ చెక్కడం అతి ప్రాచీనమైనది. రెండు వేల సంవత్సరాల అనంతరం యీ భావాన్ని ఐఖనటాన్ తిరగదోడారు. ఇదిగాక శాశ్వత విశ్వ భావాన్ని, సంఘటనల పునరుశ్చరణ, సహజ కార్యకారణ సంబంధాల గురించి కూడా యీజిప్టులో భావాలు వెల్లివిరిశాయి. క్రీ.పూ. 2500 సమయంలో పాలించిన యీజిప్టురాజు సూత్రాలు అత్యున్నత నైతిక వ్యవస్థకు చెందాయి. అందులో సహనం, దయ, సంతోషం, ధర్మం, న్యాయం, స్వార్థ త్యాగం వున్నాయి. ధర్మం శక్తివంతమైనది గనుక నిలబడుతుందన్నారు. పిసినితనం, ఇంద్రియ సుఖాలు, గర్వం తొలగించుకోవాలన్నారు. మితవాదం, నిగ్రహం అలవరచుకోవాలన్నారు. నీతి గురించి యింతకంటె ప్రాచీనమైన దేదీ లభించలేదు.

క్రీ.పూ. 2100లో 11వ ఫారవో రాజ్యానికి చెందిన సమాధి గోడపై పిల్లన గ్రోవి పాట చెక్కివుంది. ప్రపంచం, దేవుళ్ళు గురించీ, కీర్తిని ఖండించడం, సంపద అధికారాన్ని యీసడించడం, అవి భ్రమలని చెప్పడం జరిగింది. మరణం ఒక్కటే నిర్ధారితమైనదని పేర్కొన్నారు. కనుక కోర్కెలు తీర్చుకుంటూ, సుఖాలు పొందుతూ మంచి పనుల వలన పేరు తెచ్చుకోవాలన్నారు. నేటికీ సందర్భోచితంగా వుండే సామాజిక విమర్శ 2100 (క్రీ.పూ.) నాటికే చెక్కి వున్నది. అందులో పాలకుల కర్తవ్యం. పరిపాలనా న్యాయ స్వభావం ప్రస్తావించారు. తాత్విక ధోరణులు ప్రాచీన ఈజిప్టులోనూ, ఉత్తర ఆఫ్రికాలోనూ వెల్లడ య్యాయి.

హెరొడోటస్, ప్లేటో, అరిస్టాటల్ తామంతా ఈజిప్టుకు రుణపడి వున్నామన్నారు. పోలోక్, ధీల్స్, వైకర్గన్‌లో కూడా అలాగే అన్నారు. పైథాగొరస్ కూడా ఈజిప్టు, భారతీయ వివేచనను స్వీకరించి, అందించినట్లు (క్రీ.శ. 2వ శతాబ్దానికి చెందిన ఫైలోస్ట్రేటస్) రాశాడు. తత్వం అనే (ఫిలాసఫీ) మాట పైథోగొరస్ మొదట కనుగొన్నాడు. ''కేవల ద్రష్ట'' అని ఒలెంపిక్ ఆటల్లో వాడిన మాట, తాత్విక దృష్టికి నిదర్శనంగా భావించారు. అంటే ఎలాంటి

లాభాన్ని ఆశించలేదని అర్థం. ఈజిప్టులో మాత్రమే తత్వం జనించి, నిలసిల్లగలదని ఐసోక్రేటస్ భావించాడు. సంఖ్య, గణితం, రేఖా గణితం, అక్షరాలు, భాష, విజ్ఞానం, ఈజిప్టులో జనించిన విషయం ప్లేటో దాచిపెట్టలేదు. అతడి రిపబ్లిక్ కూడా ఐసోక్రేట్స్ రచనను పోలి వుంటుంది. ఇది ఈజిప్టు రాజకీయ నమూనాకు చెందినదే. ఈజిప్టులోని కుల విధానాన్ని, ఎథీనియన్ ఆదర్శంగా ప్లేటో కృషి సాగిందని మార్క్స్ అన్నాడు. (చూడు కేపిటల్ - జి.డి.హెచ్. కోల్ పరిచయంతో - ఒకటవ సంపుటి) ఈజిప్టులో గణితం, ఖగోళశాస్త్రం అధ్యయనం చేసిన ఎక్సోడస్ వద్ద అరిస్టోటల్ చదువుకున్నాడు. కుల విధానం, గణిత కళలన్నీ ఈజిప్టు కనుగొన్నట్లు అరిస్టోటల్ తన మెటాఫిజిక్స్‌లో రాశాడు.

ఇండియానుండి పాశ్చాత్యులు గ్రహించిన అనేక ఉదాహరణల్ని రాధాకృష్ణన్ ప్రస్తావించాడు. (ఈస్టరన్ రెలిజియన్స్, వెస్టరన్ థాట్) చైనాకు పాశ్చాత్య లోకం రుణపడివున్న అంశాల్ని నీధం తన బృహద్గ్రంథాలలో రాశాడు. పాశ్చాత్య లోక ప్రభావం ప్రాచ్య ప్రపంచంపై వున్నదని విదితమే. నేడు ప్రాచ్య తాత్విక శాఖలలో పాశ్చాత్యతత్వమే చెబుతున్నారు. కన్ఫ్యూసియన్, బౌద్ధం, హిందూతత్వాలు ఆయా శాఖలలోనో, ప్రాచ్య అధ్యయన కేంద్రాలలోనో చెబుతున్నారు.

## IV

హెగెల్ కాలం వరకూ భారతీయ చింతన తెలిసిన యూరోప్ వారంతా అది తత్వమే అన్నారు. హెగెల్ మాత్రం తత్వానికి మాతృభూమి గ్రీస్‌గా భావించాడు. అతడి సమకాలీనుడు విక్టర్ కజిన్ మాత్రం భారతీయతత్వం లోతు పాతులతో వున్న సరైన ఆలోచనా విధానం అన్నాడు. యూరోప్ భాషలలో లభించిన భారతీయ తత్వాన్ని హెగెల్, కసిక్‌లు చదివారు. ప్రాచ్యతత్వంలో సరైన గ్రంథం ఒక్కటి కూడా చదవని హుస్రెల్, హైడిగ్గర్‌లు యిదంతా తాత్వికంకాదని కొట్టి పారేశారు. తత్వం గ్రీస్‌లో ఆరంభమై యూరోప్‌లో అభివృద్ధి చెందిన దన్నారు. హైడిగ్గర్ దృష్టిలో ఆధునిక విజ్ఞానం, సాంకేతిక జ్ఞానం తత్వం నుండి జనించిందనీ, అది త్వరలో అంత మౌతుందనీ అన్నారు. ఆధునిక భాషలలో జర్మన్ మాత్రమే తాత్విక చింతన అందించ గలదని హైడిగ్గర్ అనుకున్నాడు.

అలాంటి సంకుచిత, దోషపూరిత భావాలు చాలామంది భారతీయులలోనూ వున్నాయి. వేదాంతం ఒక్కటే తత్వం అనీ, అది సంపూర్ణం అనీ, విశ్వవ్యాప్తంగా దీనిని పెంపొందించాలనే వారున్నారు. వేదాంతానికి అనుగుణంగా వున్న ఆధ్యాత్మిక సిద్ధాంతాలు, ఆచరణ కూడా సహనంతో స్వీకరించాలనే వారున్నారు. ఇతర విధానాలు అనుసరించే వారు సైతం యీ ధోరణిలోనే రాస్తుంటారు.

తత్వం లేకుండా ఎవరూ వుండరు. ఆ విషయం అందరూ గ్రహించక పోవచ్చు. తత్వాలన్నీ స్పష్టంగా, పొందికగా, వైరుధ్యరహితంగా వుండక పోవచ్చు. అనుభవరీత్యా, విజ్ఞాన దృష్ట్యా యివి సరిపడకపోవచ్చు. ఒకవేళ యీ ప్రమాణాలన్నీ తత్వానికి వున్నా, అంతర నైతిక దృష్టికి చెందిన సోక్రటీస్, కన్ఫ్యూసియన్, గీత, బైబిల్‌కు వ్యతిరేకంగా తత్వాలు వుండొచ్చు. అలాంటప్పుడు ఆతత్వం మంచిదనడానికి కొంచెం తటపటాయిస్తాను. ★

---

డా. కొత్త సచ్చిదానంద మూర్తి యు.జి.సి. వైస్ చైర్మన్‌గా, వెంకటేశ్వర విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్‌గా, ఆంధ్ర యూనివర్శిటి తాత్వికాచార్యుడుగా, చింతనాపరుడుగా, నాగార్జున యూనివర్శిటి బౌద్ధకేంద్ర స్థాపకుడుగా పేరొందిన మేధావి. ఇంగ్లీషులో, తెలుగులో అనేక గ్రంథాలు రచించారు. ప్రపంచ వ్యాప్తంగా పర్యటన చేశారు. ప్రస్తుతం సంగం జాగర్లమూడి, తెనాలి తాలూకాలో వుంటున్నారు.

(1993 మార్చి 3న అంతర్జాతీయ గోష్ఠి, మకావ్‌లో సమర్పించిన వ్యాసం)

సమీక్ష:

# ప్రేమించడం ఒక కళ

**Art of Loving**
**By ERICH FROMM**

- అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి

స్వప్రేమ, పరప్రేమ సంయోజకాలని ఒప్పుకొన్న తరువాత, పరులమీద అపేక్షను త్రోసివేసే స్వార్థాన్ని, మనం ఎలా వివరిస్తాము! స్వార్థపరునికెప్పుడూ తనమీదే ఆసక్తి, అన్నీ తనకే కావాలంటాడు. పుచ్చుకోవడంలో తప్ప, అతనికి ఇవ్వడంలో ఆనందంలేదు. బాహ్య ప్రపంచం నుంచి తనుకు చేకూరే మేలును దృష్టిలో పెట్టుకొని, దానిని చూస్తాడు. ఇతరుల అవసరాలపట్ల అతనికేమాత్రం ఆసక్తి ఉండదు. వారి ఉన్నతిని, నీతిని గౌరవించలేడు. ప్రతి ఒక్కరిని, ప్రతి వస్తువును, అవి తనకెలా ఉపయోగపడతాయనే దృష్టితో వాటికి విలువనిస్తాడు. అతనికి ప్రాధమికంగా ప్రేమించే శక్తిలేదు. స్వాపేక్ష, పరాపేక్ష - ఈ రెండు అనివార్య వికల్పికలని తేలడం లేదా! స్వార్థ, స్వానురాగం - రెండు ఒకటే అయితే ఇది అంతే అవుతుంది. కాని అలా భావించిన కారణంగానే, ఈ సమస్యకు సంబంధించి, అనేక దోషాలు దొర్లుతున్నాయి. స్వార్థం, స్వానురాగం ఒకటే అనేమాట అటుంచి, వాస్తవానికి అవి రెండు విరుద్ధాలు. స్వార్థపరుడు తనను తాను ఎక్కువగా కాక, అతి తక్కువగా ప్రేమించుకొంటాడు. వాస్తవంలో అతనికి అతని మీదే ద్వేషము. ఈ రకంగా, తన మీద తనకు, ప్రేమ అపేక్షలు లేకపోవడం అతని సృజనాత్మక శక్తిహీనతకు నిదర్శనము. అతడు శూన్యంతో కుంఠనంతో బాధపడతాడు. అతడు అవశ్యక నిస్సంతోషి. ఏ సంతృప్తిని పొందటానికి వీలులేకుండ అడ్డుగోడలు కట్టుకొన్నాడో, ఆ సంతృప్తిని జీవితం నుంచి ఆకస్మికంగా జార్రుకోవాలని అతడు తహతహలాడతాడు. తనపై తనకెంతో అపేక్ష ఉన్నట్లు కనిపిస్తాడు. కాని అతడు స్వప్రేమరాహిత్యాన్ని కప్పి పుచ్చు కోవడానికి, ఈ లేమిని పూడ్చుకోవడానికి శుష్క ప్రయత్నాలు చేస్తుంటాడు. ఇతరులను ప్రేమించడానికి మారు, ప్రేమనంతా తన మీదికే తిప్పుకొన్నట్లుగా స్వార్థపరుని పరిగణించి అతనిని స్వానురాగి అంటాడు ఫ్రాయిడ్. స్వార్థపరులు ఇతరులను ప్రేమించలేని మాట వాస్తవమే. కాని వారు తమను తాము ప్రేమించుకోలేక పోవడం గూడ నిజమే.

స్వార్థాన్ని ఇతరులమీద అత్యంత అపేక్షతో పోలిస్తే, దానిని అర్థం చేసుకోవడం సుకరమవుతుంది. ఉదాహరణకు బిడ్డమీద అత్యంత ఉత్కంఠను చూపే తల్లిని తీసుకోండి. తన బిడ్డమీద తనకెంతో ప్రేమ అని ఆమె చేతనంగా నమ్ముతుంది. కాని వాస్తవంలో, ఆమె అంతరాంతరాలలో బిడ్డను ఎంతగానో ద్వేషిస్తోంది. ఆమె ప్రదర్శించే ఉత్కంఠ అంతా బిడ్డమిది ప్రేమవలన కాదు. అసలు ఆ బిడ్డను ప్రేమించే శక్తి ఆమెకు లేదు. ఆ 'లేమి'ని కప్పిపుచ్చుకోవడానికి ఆమె చేసే శుష్క ప్రయత్నమే ఆ ఉత్కంఠ.

ఈ స్వార్థ సిద్ధాంతాన్ని, నూరోటిక్ ''నిస్వార్థం''తో మనకు ఉన్న విశ్లేషణానుభవం

బలపరుస్తుంది. 'న్యూరోటిక్ కాక దీనితో ముడిపడి ఉన్న నిస్వార్థం'' అనేది న్యూరోసిస్ రోగలక్షణము. ఈ లక్షణంతో అవసాదం క్రుంగిపోవుట (depression) అలసట, పనిచేసే శక్తి లేక పోవడం, ప్రేమవైఫల్యం లాంటి లక్షణాలున్న అనేకమందిలో ఈ లక్షణ, కన్పడింది. వారు నిస్వార్థాన్ని ''రోగలక్షణం''గా భావించక పోవడమే కాక, దానిని స్వాస్థ్యగుణంగా ఎంచి గర్వపడతారు. ''నిస్వార్థ'' వ్యక్తి ''తన కోసం ఏదీ కోరడు'': అతడు ''ఇతరుల కోసమే జీవిస్తాడు''. తనకు ప్రాముఖ్యాన్ని ఇచ్చుకోనందుకు గర్విస్తాడు. తను నిస్వార్థుడైన అతడు సుఖపడడం లేదు. సన్నిహితులతో అతని సంబంధాలు తృప్తికరంగా ఉండడంలేదు. ఇది తలచుకొని అతడు కలత పడతాడు. ఈ 'నిస్వార్థం' అనేది వేరేలక్షణం కాదని, అది రోగ లక్షణాలతో ఒకటని, చాల ముఖ్యమైనదని, దేనినైన అనుభవించడానికి గాని, ప్రేమించడానికి గాని అతని శక్తి సన్నగిల్లిందని, జీవితం మీద రోతపడుతుందని, ఈ నిస్వార్థం వెనుక సూక్ష్మమైన తీవ్రమైన 'ఆత్మ కేంద్రకత్వం' (self centredness) గూడు కట్టుకొని ఉన్నదని విశ్లేషణం చెబుతున్నది. అతని నిస్వార్థానికి ఇతర కలతలకు మూలమైన సృజనాత్మక తారాహిత్యాన్ని సరి దిద్దేట్టుగ అతని నిస్వార్థానికి ఇతరరోగ లక్షణాలకు వలె అర్థ చెప్పితేనే గాని అతనికి స్వాస్థ్యం చిక్కదు.

నిస్వార్థం యొక్క స్వభావం, అది ఇతరులమీద చూపే ప్రభావంలో మనకు గోచరిస్తుంది. మన సంస్కృతిలో, ''నిస్వార్థజనని బిడ్డలమీద వేసే ప్రభావంలో ఇది వ్యక్తమవుతుంది, ప్రేమింపబడడం అంటే ఏమిటి? తిరిగి ప్రేమించడమంటే ఏమిటి? - ఈ విషయాలను తన నిస్వార్థత ద్వారా తన పిల్లలు గ్రహిస్తారని తల్లి భావిస్తుంది. కాని ఆమె నిస్వార్థ ప్రభావం ఆమె ఆశించినట్లు ఉండదు. ప్రియులమని భావించిన వారిలో కలిగిన సంతోషాన్ని ఆమె పిల్లలు కనబరచరు. ఆ పిల్లలు వ్యాకుల చిత్తులవుతారు; బిగుసుకు పోతారు; తల్లి అనమతి కోసం ఆరాటం ఉంటుంది; ఆమె ఆశలకు అనుగుణంగా నడచుకోవాలను ఎదురు చూస్తుం టారు. మామూలుగా జీవితంమీద తల్లికి ఉన్న అంతర్గత ద్వేషంతో ప్రభావితులవుతారు. ఈ ద్వేషాన్ని వారు స్పష్టంగా గుర్తించలేరుగాని, వాసన పడతారు. చివరకు అది వారిలో జీర్ణించకు పోతుంది. మొత్తంమీద నిస్వార్థ జనని ప్రభావానికి స్వార్థపూరిత మాతృ ప్రభావానికి ఎక్కువ తేడాలేదు. నిజంగా ఇంక మొదటిదే చెడ్డది. ఎందుకంటె తల్లి నిస్వార్థం, పిల్లలు ఆమెను విమర్శించ కుండ, అడ్డుకొంటుంది, ఆమెను నిరుత్సాహ పరచకూడదనే ధర్మానికి వారు లోనవుతారు, ఈ సుగుణం అనే ముసుగులో జీవితంమీద అయిష్టత వారిలో పాదు కొంటుంది. శుద్ధ స్వానురాగం ఉన్న తల్లి ప్రభావాన్ని పరిశీలించినట్లయితే, అటువంటి (తనను తాను ప్రేమించుకొనే) తల్లి చేత ప్రేమింపబడడం కంటె, బిడ్డకు ప్రేమ, సుఖసంతో షాలకు అనుభవాన్ని సమకూర్చడంలో ఏక్కువైనది మరొకటి లేదని అర్థమవుతుంది.

స్వానురాగ భావనలను క్రోడీకరించాలంటే మనం మియిష్టర్ (meisetrec khart)ను ఉటంకించాలి; ''నీవు ప్రేమించు కొన్నట్లయితే, నీవలె ప్రతి ఒక్కరిని ప్రేమిస్తావు. ఇతరులను నీ కంటె తక్కువగ ప్రేమించినంత కాలం నిజంగా నిన్ను ప్రేమించుకో లేవు. నీతో గూడ కలుపుకొని అందరిని నీవు సమానంగా ప్రేమించి నట్లయితే, నీవు వారిని ఏక వ్యక్తిగా ప్రేమిస్తావు. ఆ ఏక వ్యక్తే భగవంతుడు; మానవుడు తనను తాను ప్రేమించకొంటూ, అందరిని సమంగా ఎవడు ప్రేమిస్తాడో అతడు గొప్పవాడు, నీతివంతుడు''.

## దైవ ప్రేమ (Love of god)

ఒంటరి తనాన్ని అనుభవించడంలో, దానివలన కలిగిన వ్యాకులతను సాయుజ్యం ద్వారా పరహరించడంలో ప్రేమ 'అవసరం' ఉన్నదని ఇంతకు ముందు చెప్పుకొన్నాము. దైవప్రేమ అని చెప్పబడే మత సంబంధమైన ప్రేమరూపం మనో వైజ్ఞానికంగా చెప్పాలంటే మానవ ప్రేమకంటె వేరు కాదు, ఒంటరితనాన్ని అధిగమించడానికి, సాయుజ్యం చెందడానికి పడే తపనలో నుంచి అదిపుడుతుంది, వాస్తవానికి మానవ ప్రేమకున్నట్లే దైవ ప్రేమకు వేరు వేరు, గుణాలు ముఖాలు ఉన్నాయి. చాలావరకు అవే తేడాలు మనకు కనిపిస్తాయి. దేవుడున్నాడని నమ్మే మతాలన్నింటిలోను - అవి బహుదేవతారాధన మతాలైన, ఏకేశ్వరోపాసన మతాలైన - దేవుడే అన్నింటికంటె విలువైన వాడు, కోరదగినవాడు. వ్యక్తికి అత్యంతంగా ఏది మంచిదో దానిమీద ఆధారపడి దేవునికి ప్రత్యేకార్థాన్ని చెప్పాలి. అందువలన దేవుడంటే ఏమిటో అర్థం చేసుకోవడానికి, దేవుని పూజించే వ్యక్తి శీల నిర్మాణాన్ని (character structure) అర్థం చేసుకోవాలి.

మనకు తెలిసిన దానినిబట్టి, మానవజాతి వికాసం ప్రకృతినుంచి, తల్లి నుంచి, భూమి నుంచి, రక్తపాశాలనుంచి ఆరంభమైనట్లు చెప్పవచ్చు. మానవచరిత్ర ప్రారంభంలో, ప్రకృతి ఒడిలోనుంచి విసరి వేయబడినప్పటికి, అతడు ఇంకా ఆ ప్రాథమిక బంధాలనే పట్టుకు వేళ్లాడుతున్నాడు. ప్రతీపగమనం వల్ల లేదా ఈ ప్రాథమిక బంధాలను పట్టుకు వేళ్లాడడం వల్ల అతడు భద్రతను అనుభవిస్తున్నాడు. అతడు ఇంక జంతు, వృక్ష ప్రపంచంతో ఏకం కావాలనుకొంటున్నాడు; ప్రకృతిలో ఒకడై పోవాలను కొంటున్నాడు. ప్రాచీన మతాలను చూస్తే, మానవజాతి వికాసంలో ఇటువంటి దశ ఒకటి ఉన్నదని తెలుసుకొంటాము. ఈ దశలో ఒక జంతువు ఆరాధ్యవస్తువుగ (అదృష్ట సంబంధానికి ప్రతీకగ) పరివర్తితమవుతుంది. పవిత్ర మత కర్మలలో లేదా యుద్ధాలలో ఒకడు జంతు చర్మాల తొడుగులను ధరిస్తాడు; ఒకడు జంతువును దేవునిగా ఆరాధిస్తాడు. అ తరవాతి వికాసదశలో పనితనం పెరిగి, అతడు కళాత్మక స్థాయికి చేరుకొన్నప్పుడు, పూర్తిగ ప్రకృతి దయా ధర్మాలమీద ఆధారపడనప్పుడు - తనకు కనిపించిన ఒక పండును, తను చంపిన ఒక జంతువును తనచేతిలో తయారుచేసిన ఏ వస్తువునైన దేవునిగా మారుస్తాడు. బంగారం, వెండి, మట్టితో తయారైన విగ్రహాల ఆరాధనదశ ఇదే. తాను తయారు చేసే వస్తువులలోకి మానవుడు తనశక్తి యుక్తులను ప్రక్షేపిస్తాడు. ఈ విధంగా వైమనస్యధోరణి (alienated fashion)లో తన వీర్యాన్ని, తన సంపదను (possessions) ఆరాధిస్తాడు. ఇంకా తరువాతి పరిణామదశలో మానవుడు దేవతలకు మానవరూపాలను కల్పిస్తాడు. మానవుడు తనను గురించి ఎక్కువగ తెలిసికొన్నప్పుడు, ఈ ప్రపంచంలో తనే అన్నిటికంటె ఎక్కువని, మాన్యమైన "వస్తువు" అని గ్రహించినప్పుడు మాత్రమే ఇది జరగడానికి వీలున్నట్లు కనిపిస్తుంది. మానవాకృతి పొందిన దేవుని పూజించే ఈ దశలో వికాసం రెండు తెరగులలో జరగడం కనిపిస్తుంది. ఇందులో ఒకటి, దేవతల స్త్రీ లేదా పురుష స్వభావాలకు సంబంధించినది. రెండవది ఏ మేరకు మానవుడు పరిణతి చెందాడు? ఏది దేవతల స్వభావాన్ని, ఆ దేవతల యెడ తనకున్న ప్రేమస్వభావాన్ని నిర్ణయిస్తుంది? - అనే వాటికి సంబంధించినది.

మొదట మాతృ కేంద్రమతాల నుంచి పితృ కేంద్రమతాలకు జరిగిన పరివర్తనను

వివరిద్దాము. పందొమ్మిదవ శతాబ్ది మధ్యలో బాకొఫెన్ (Bachofen) మోర్గాన్ (Morgan)లు కొన్ని విషయాలు కనుగొన్నారు. ఇవి చాల గొప్పవి; నిష్కర్షమైనవి. వీటిని కొందరు తోసి వేసినప్పటికి, ఇవి విద్వత్సభలలో చర్చింపబడుతూనే ఉన్నాయి. వీటి ప్రకారం, కనీసం అనేక సంస్కృతులలో మాతృస్వామ్యదశ తరవాతనే పితృస్వామ్యదశ అవతరించినట్లు నిస్సందేహంగా చెప్పవచ్చు. మాతృస్వామ్యంలో అన్నిటి కంటె ఉన్నతమైనది తల్లి. ఆమె దేవత. కుటుంబంలో, సమాజంలో ఆమెదే అధికారము. మాతృసామ్య మతసారాన్ని అర్థం చేసుకోవడానికి మాతృ సదృశ ప్రేమను గురించి ఏమి చెప్పామో గుర్తుచేసుకొంటే చాలు. తల్లి ప్రేమ నిబంధనలు లేనిది. అది సర్వరక్షకమైనది (all protective) సర్వ పరివేషకము (all enveloping). కనుక దానిని పరిమితులలో ఉంచడానికి గాని, ఆర్జించడానికి వీలు లేనిది. ప్రేమితుడు (loved) దాని సముఖంలో మహదానందాన్ని పొందుతాడు. దాని ఆ భావంలో అంతా పోగొట్టుకొన్నట్లు పరమ నిరాశననుభవిస్తాడు. తల్లికి బిడ్డలం కాన తల్లి మనలను ప్రేమిస్తుంది. అంతేకాని మనం ''మంచి'' వాళ్ళమని, విధేయులమని, లేదా ఆమె కోర్కెలను తీర్చామని, ఆజ్ఞలు పాలించామని ఆమె మనలను ప్రేమించడంలేదు. అందువల్ల తల్లిప్రేమ సమతపై ఆధారపడి ఉంటుంది. మానవులంతా సమానులే, ఎందువల్ల? వాళ్ళంతా తల్లికి బిడ్డలు; వారంతా భూమాత బిడ్డలు.

తరవాతి పరిణామం పితృస్వామ్యదశ. మనకు సమగ్రంగా తెలిసింది ఈ దశను గురించే. దీనికి సంబంధించిన జ్ఞానాన్ని అనుమానాల (inference) ద్వారా, ప్రాక్కల్పనల ద్వారా సాధించవలసిన పనిలేదు. ఈ దశలో తల్లికి సింహాసనచ్యుతి జరిగింది. మతంలో, సమాజంలో తండ్రి ఉన్నతుడయ్యాడు. పితృసదృశ ప్రేమ స్వభావం ప్రకారం, అతడు విధులను నిర్దేశిస్తాడు; సూత్రాలను, చట్టాలను తయారుచేస్తాడు. తండ్రి నిర్దేశాలకు అనుగుణంగా నడిస్తేనే కొడుక్కి తండ్రి ప్రేమ దక్కుతుంది. తండ్రి ఎప్పుడుగూడ అచ్చంగా తనవలె ఉన్న కొడుకుని ప్రేమిస్తాడు. అత్యంత విధేయుడై తన ఆస్తికి వారసుడుగా తన తరవాత తన స్థానాన్ని ఆక్రమించగల కొడుకునే అధికంగా ప్రేమిస్తాడు. (పితృస్వామ్య సమాజాభివృద్ధి, వ్యక్తిగత ఆస్తి ఏర్పాటు ఒకేసారి జరగాయి). ఫలితంగా పితృస్వామ్య సమాజం నిచ్చెనమెట్ల సమాజమైంది. సోదరులమధ్య సమానత్వం పోటీకి, పరస్పర ద్వేషానికి దారితీస్తుంది. భారతీయ ఈజిప్టు, లేదా గ్రీకు సంస్కృతులను చూచినా, లేదా యూదు, క్రైస్తవ మతాలను చూచినా మనకు పితృస్వామ్య ప్రపంచమే గోచరిస్తుంది. ఇందులో పురుష దేవతలుంటారు. వీరందరిని శాసించే మరొక పెద్ద దేవుడుంటాడు. లేదా మరికొన్నిటిలో వీరంతా లేకుండా ఒకడే దేవుడుంటాడు. ఏది ఏమైె, మనిషి గుండెనుంచి మాతృప్రేమ కోసం పడే తపనను తొలగించలేము కనుక, విశ్వదేవతాగణం నుంచి ప్రేమ మూర్తి అయిన తల్లి ఆకృతిని పూర్తిగా తొలగించలేక పోయాము. యూదీయ మతంలో, దేవునిలోని మాతృపక్ష అంశాలను, మార్మికవాదం (Mysticism)లోని అనేక పొరలలోకి ప్రవేశపెట్టారు. కాథలిక్ మతంలో కన్య, చర్చి తల్లికి ప్రతీకలయ్యాయి. ప్రొటెస్టాంట్ మతంలోగూడ మృతృ మూర్తిని పూర్తిగా తొలగించలేకపోయారు. అమె గుప్తంగా ఉంది. ''మానవుడు ఏమిచేసినా, అది దేవుని ప్రేమను పొందలేదు'', అనే దానిని తన ముఖ్య సిద్ధాంతం చేసుకొన్నాడు లూథర్. దేవుని ప్రేమయే అనుగ్రహము. ఈ అనుగ్రహాన్ని విశ్వసించడమూ, తనను తాను అల్పునిగా, నిస్సహాయునిగా

చేసుకోవడమూ మత దృక్పథము. కాథలిక్ సిద్ధాంతాలు చెప్పినట్లు ఏ మంచి పని దేవుని ప్రభావితం చేయలేదు; దేవుని ప్రేమను మనమీద సారింపచేయలేదు. మంచి పనులకు సంబంధించిన కాథలిక్ సిద్ధాంతాన్ని మనం పితృస్వామ్య వ్యవస్థలో భాగంగా గుర్తించవచ్చు. తండ్రికి విధేయతను చూపి, అతని ఆదేశాలను పాలించి, అతని ప్రేమ వాత్సల్యాలను పొందగలను. అంతేకాక లూథర్ సిద్ధాంతంలో, దీనిలో పితృస్వామ్య సంప్రదాయలున్నప్ప టికి, మాతృ సంబంధమైన అంశం గుప్తంగా ఉంది. తల్లిప్రేమను ఆర్జించడమనే ప్రశ్నేలేదు. అది అక్కడ ఉండడమూ లేకపోవడమో జరుగుతుంది; నేను చేయగలిగిందల్లా విశ్వాసముంచి (భజన కీర్తనల కర్త, డేవిడ్, చెప్పినట్లు - ''నా తల్లి వక్షోజాల విశ్వాసము నిలుపనిమ్ము''), నన్ను నేను నిస్సహాయుడైన, శక్తిహీనుడైన శిశువుగా భావించడమే. కాని లూథర్ మతంలో ఒక విశేషం ఉంది. రంగస్థలినుంచి తల్లి ఆకృతిని మాపుచేసి దానిని తండ్రి చిత్రంతో పూరించడము. సందేహానికి తావులేని తల్లి ప్రేమకు బదులు సందేహాస్పదమైన ఆశించ వీలులేని నిర్నిబంధమైన తండ్రి ప్రేమను ఆశించడం అతిముఖ్య లక్షణమైపోయింది.

దైవ ప్రేమ లక్షణం మతంలోని పితృస్వామ్య అంశాల సాపేక్షబలం మీద ఆధారపడుతుం దని చెప్పడానికి నేను వాటి మధ్య భేదాన్ని చూపిం వలసివుంది. పితృస్వామ్య అంశం, దేవుని, తండ్రిలాగ ప్రేమించేట్టు చేస్తుంది. నేను అతనిని (దేవునీ) ధర్మవిహితుడైన నిష్కార వ్యక్తిగా, శిక్షించేవానిగా, వరాలిచ్చేవానిగా భావిస్తాను. ఇదేవు ఇజ్రేల్-అబ్రహాంను ఎన్నుకొ న్నట్లు, ఐజాక్ జాకబ్‌ను ఎన్నుకొన్నట్లు, తనకిష్ట జాతిని ఎంపిక చేసుకొన్నట్లు చివరకు నన్ను అభిమాన పుత్రునిగా గ్రహిస్తాడు. మతాన్ని మాతస్వామ్య పక్షంనుంచి చూస్తే, సర్వాన్ని కౌగిలించుకొనే తల్లిలాగ దేవుని ప్రేమిస్తాను. ఆమె ప్రేమలో నాకు విశ్వాసముంది. నేను పేదనైన, శక్తిహీనుడనైన, పాపినైన పరవాలేదు. ఆమె నన్ను ప్రేమిస్తుంది. నన్ను కాదని, ఆమె పిల్లలో ఎవరిని దగ్గరకు తీయదు. నాకు ఏమి జరిగినా ఆమె నన్ను కాపాడుతుంది. క్షమిస్తుంది. దైవప్రేమ, దేవుని ప్రేమలను వేరుచేయడానికి వీలులేదు. దేవుడు తండ్రి అయితే అతడు నన్ను కొడుకులాగ ప్రేమిస్తాడు; నేను అతనిని తండ్రిలాగ ప్రేమిస్తాను. దేవుడు తల్లి అయినట్లయితే, ఆమె ప్రేమ, నా ప్రేమలను ఈ విషయము నిర్ణయిస్తుంది.

దైవ ప్రేమలోని మాతా పితరుల అంశాలలోని ఈ వ్యత్యాసం ఈ ప్రేమ స్వభావాన్ని నిర్ణయించే వాటిలో ఒకటి మాత్రమే. రెండవ అంశం, దైవ ప్రేమలోను, దైవ భావనలోను వ్యక్తి ఏ మేరకు పరిణతి చెందాడు. అనేది సమాజపరంగాను, మతపరంగాను మానవజాతి పరిణామం మాతృస్వామ్యం నుంచి పితృస్వామ్యానికి సాగింది కనుక, పరిణతి చెందుతున్న ప్రేమ వికాసాన్ని పితృస్వామ్య మత పరిణామం ద్వారా పరిశీలించవచ్చు. ఈ రకమైన పరిణామారంభంలో తన సృష్టి అయిన మానవుణ్ణి తన ఆస్తిగా పరగణించే, అసూయాపరు డైన, నిరంకుశుడైన దేవుని చూస్తాము. తను సృష్టించిన మానవుణ్ని తన ఇష్టం వచ్చినట్లు ఆడించవచ్చుననుకొనే దేవుడు మనకు కనిపిస్తాడు. మతం ఈ దశలో ఉన్నప్పుడే, దేవుడు మనిషిని స్వర్గంనుంచి తరిమివేశాడు. లేనట్లయితే మానవుడు జ్ఞానవృక్షం ఫలంతిని తనే దేవుడు కాగిలిగేవాడు. ఈ దశలో దేవుడు ఒక పెద్ద వెల్లువతో మానవజాతిని నాశం చేయాలనుకొన్నాడు; ఎందుకంటె ఒకడూ తనను, తృప్తిపరచలేకపోయారు, ఒక్క తన ముద్దులకొడుకు నోయె (Noah) తప్ప. ఈ దశలోనే దేవుడు, తనయెడ భక్తి ప్రవత్తులకు

నిదర్శనంగా, అబ్రహాంను, అతని ఏకైక ప్రియపుత్రుడు ఇజక్‌ను చంపి, విధేయతను చూపమంటాడు. అదే సమయంలో ఒక నూతన దశ ప్రారంభమవుతుంది; నోయెతో దేవుడు మరెప్పుడు మానవజాతిని నాశనం చేయనని ఒడంబడిక చేసుకొంటాడు. ఆ ఒడంబడికకు అతడు బద్ధుడయ్యాడు. తన వాగ్దానాలతోనే గాక తనపైన న్యాయ సూత్రాలతో, తనే బంధితుడయ్యాడు. అందువలన అక్కడ కనీసం పదిమంది సత్పురుషులు ఉంటే సడమ్ (sodom)ను కాపాడాలనే అబ్రహాం అభ్యర్ధనకు దేవుడు లొంగి పోవాలి. కాని ఈ పరిణామం, నిరంకుశుడైన, తండానాయకుణ్ని, దేవుణ్ని, ప్రేమమూర్తి అయిన తండ్రిలాగ ఉండడంతోనే ఆగక, అతణ్ని తన నియామలకు తనే కట్టుబడి ఉండే తండ్రిగ మలచిన ఈ పరిణామదశ దేవుణ్ని, తండ్రి ఆకృతినుంచి, అతడు ప్రతిపాదించిన ధర్మం, ప్రేమ సూత్రాలను ప్రతీకంగా మార్చి వేసింది. మనిషిలోని ఆత్మ సంబంధమైన బీజాల నుంచి వికసించి పుష్పదర్శనానికి అతడు ప్రతీక. దేవునికి పేరు ఉండడానికి వీలులేదు. పేరు ఎప్పుడూ ఒక వస్తువునో, వ్యక్తినో, ఆద్యంతాలున్న దేనినో సూచిస్తుంది. అసలతడు ఒక వ్యక్తికానప్పుడు, ఒక వస్తువు కానప్పుడు దేవునికి పేరెలా ఉంటుంది?

మోజిస్ (Moses)కు దైవసాక్షాత్కారం జరిగిన బైబిల్ కథలో ఈ పరిణామం కొట్టవచ్చి నట్లు కనిపిస్తుంది. దేవునిపేరు చెప్పకుండ, తనను దేవుడు పంపాడని చెబితే హిబ్రూలు నమ్మరని మోజిజ్ దేవునితో అన్నప్పుడు, దేవుడు ఒకరాయి తీసి ఇచ్చాడు. అసలు మూర్తి అంటేనే పేరు అయినప్పుడు, విగ్రహారాధకులు పేరులేని దేవుని ఎలా అర్థంచేసుకోగలరు? అప్పుడు దేవుడు మోజిక్‌కు తన పేరును ''నేను ఏది అవుతున్నానో అది అవుతున్నాను'' అని చెప్పాడు. ''నేను అవుతున్నాను అనేది నా పేరు.'' ''నేను అవుతున్నాను'' అనేదానికి అర్థం దేవునికి అంతంలేదని, ఒక వ్యకికాడని, అవాక్యానికి సరిగా అర్థం చెప్పాలంటే; ''నా నామం అనామం'' అని వారికిచెప్పు. దేవుని ఏరకమైన మూర్తిగా ఊహించుకోవడాన్ని, అతని పేరును వృధాగా జపించడాన్ని, చివరకు అసలు అతనిపేరునే ఉచ్చరించడాన్ని నిషేధించ డంలో ఒకే లక్ష్యం ఉంది. దేవుడు తండ్రి, దేవుడు భక్తి అనే భావన నుంచి మనిషిని విముక్తం చేయడమే. తరవాత జరిగిన ఆస్తిక పరిణామంలో దేవుని సగుణరూపునిగా ఊహించరాదనే సూత్రంలో ఈ లక్ష్యాన్ని ఇంకొంత ముందుకు తీసుకుపోయారు. దేవుడు తెలివైనవాడు, బలశాలి. మంచివాడు అని చెబితే దేవుడు ఒక వ్యక్తి అయిపోతాడు. నేను చేయగలిగిందల్లా దేవుడు ఏదికాదో చెప్పడమే - నిర్గుణుడు. నిర్దయుడు కాడు, అధర్మికాదు అని చెప్పడము. దేవుడు ఏదికాదో నాకు ఎంత ఎక్కువగ తెలిస్తే దేవునిగురించి నాకు అంత ఎక్కువగ తెలిసినట్టు.

పుంజుకొంటున్న ఏకేశ్వ భావన వలన ఫలితాలననుసరించి ఒక నిర్ణయానికి రావచ్చు; అసలు దేవుని పేరు ఎత్తకపోవడమంటే దేవుని గురించిమాట్లాడకపోవడమే. అప్పుడు దేవుడు ఏకేశ్వరనాదంలో బీజరూప దేవుడవుతున్నాడు. ఈ దేవుడు నామరహితుడు; వ్యక్తీకరింప వలనుపడని అస్పష్ట భాషణం; అనేకత్వంలోని ఏకత్వం; సర్వాధారుడు. దేవుడు సత్యం, ధర్మం, ప్రేమ అవుతాడు. నాలోని మానవత్వం మేరకు దేవుడే నేను.

మానవాకృతినుంచి శుద్ధ ఏకేశ్వరవాదానికి దారితీసిన ఈ పరిణామం దైవప్రేమ స్వభావం లోని తేడాకు ముఖ్యకారణమని తేలుతున్నది. తండ్రికివలె అబ్రహం దేవుని ప్రేమించవచ్చు.

అతడంటే భయపడవచ్చు. కొన్నిసార్లు అతనిలో క్షమ ఆధిక్యత వహిస్తే, మరికొన్నిసార్లు కోపానిది పైచేయి అవుతుంది. దేవుడు తండ్రి అయినంతవరకు నేను బిడ్డనే. సర్వజ్ఞత, సర్వశక్తుల కోసం చేసే స్వైరకల్పన నుంచి నేను పూర్తిగా బయట పడలేదు. మానవునిగ పరిమితులను, నా అజ్ఞానాన్ని, నా నిస్సహాయతను గుర్తించేటంతటి వస్తుగత దృష్టి నాకు ఇంకా ఏర్పడలేదు. పిల్లవానికి వలె, ఇంకానేను, నన్ను రక్షించే, శిక్షించే, కాపాడే తండ్రి కావాలంటాను. నేను విధేయత జూపిస్తే నన్ను ప్రేమించి, నేను పొగిడితే పొంగిపోయి, అవిధేయుడ నైనప్పుడు కోపించే తండ్రి నాకు కావాలి. ప్రజలలో ఎక్కువమంది తమ వ్యక్తిగత వికాసంలో ఈ శైశవ దశను అధిగమించ లేదనేది విదితము. అందుకని చాలమందికి దేవుడిలో నమ్మకమంటే సహాయకారుడైన తండ్రిలో నమ్మకమే - శైశవభ్రమ. మతపరమైన ఇటువంటి భావనము కొంతమంది ప్రసక్తులు, మామూలు ప్రజలలో కొద్దిమంది అధిగమించి నప్పటికీ, మతస్వరూప స్వభావాలను ఇంక అదే దిద్దుతున్నది.

ఇది ఇలా ఉన్నప్పుడు, దైవభావనపై ఫ్రాయిడ్ చేసిన విమర్శ సహేతుకమైనదే, అయితే ఫ్రాయిడ్ చేసిన దోషం ఏకేశ్వర మతం రెండవదరిని మరిచిపోవడంలో ఉంది. దాని అసలు సారాంశం భగవంతుని ఈ రకంగా భావించడం కూడదంటున్నది. నిజమైన మతావలంబి, అతడు నిజంగా ఏకేశ్వర భావనను అనుసరించినట్లయితే దేవుని దేనికోసమూ ప్రార్థించడు, అతనినుంచి ఏమీ ఆశించడు. బిడ్డ తండ్రినో, తల్లినో ప్రేమించినట్లుగా అతడు దేవుని ప్రేమించడు. దేవుని గురించి తనకేమీ తెలియదనే మేరకు అతడు వినమ్రుడనే చెప్పాలి. మానవుడు తన పరిణామారంభంలో దేనికోసం ఆరాటపడ్డాడో దానికి భగవంతుడు ప్రతీక అవుతున్నాడు. ఆధ్యాత్మిక ప్రపంచానికి, ప్రేమకు, సత్యానికి, ధర్మానికి ప్రతీక అవుతున్నాడు. ''దేవుడు'' ప్రతిబింబించిన సూత్రాలలో అతనికి విశ్వాసం ఉంది. అతడు సత్యాన్ని ఆలోచిస్తాడు. ప్రేమను, ధర్మాన్ని జీవిస్తాడు. ''అత్యంత అపేక్షణీయ'' మైన ఒకే ఒక విషయంగ, ఒకే ఒక అవశ్యక సత్యంగా, అతని మానవతాశక్తులు నిండుగా వివృతమయ్యే అవకాశాన్ని అతని జీవితం కల్పించినప్పుడు అది సార్థకమైనదని భావిస్తాడు. దేవుని ప్రేమించడమంటే, అతడు ఈ పదాన్ని ఉపయోగిస్తున్నట్లుయితే, ప్రేమించడానికి వలసిన పూర్తి సత్తాను పొందాలని ఆశించడం, తనలో ''దేవుడు'' దేనిని ప్రతిబింబిస్తున్నాడో దానిని వాస్తవం చేసుకోవడము ఈ దృక్పథం నుంచి చూస్తే, ''ఈశ్వరజ్ఞాన'' నిరాకరణం (theology) అంటే సమస్త దివ్య జ్ఞాన నిరాకరణం ఏకేశరవాద తార్కిక ఫలము. అయినా, అటువంటి సమూలమైన అద్వైత దాంతిక దృక్పథానికి (non-theological view), అస్తిక వ్యతిరేక సిద్ధాంతానికి (non-theological system) మధ్య మనం అనుకొన్నట్లు తేడాఉంది. ఉదాహరణకు ప్రాచీన బౌద్ధంలోను లేదా టావో వాదంలోను ఆ తేడా కనిపిస్తుంది.

అన్ని ఆస్తిక మతాలలోను, అద్వైత దాంతిక మార్మిక మతంలో గూడ, మానవుని ఆధ్యాత్మిక శక్తులను, విముక్తి అంతర్జన్మల (inner births) కోసం అతడు పడేతపనకు అర్థాన్ని, ప్రామాణికతను కల్పించే అధిమానస మైన ఆధ్యాత్మిక సత్యాన్ని ప్రతిపాదించడం జరిగింది. అస్తిక వ్యతిరేక విధానంలో మానవునికి వెలుపలగాని, పైనగాని ఆధ్యాత్మిక ప్రపంచం ఉండదు. మానవుడు తన పరిణామప్రక్రియ అంతట, ప్రేమ, న్యాయ, వివేచన శక్తులను తనలో వికసింప చేసికొన్న మేరకే వీటి ప్రపంచం వాస్తవమవుతుంది. ఈ దృక్పథంలో, జీవితానికి, మానవుడు

కల్పించే అర్థం తప్ప వేరే అర్థం లేదు. ఇతరునికి సహాయం చేయడం వరకు తప్పిస్తే మానవుడు పూర్తిగ ఏకాకే.

దైవప్రేమను గురించి ఇంత చెప్పిన తరువాత, నాకు సంబంధించినంత వరకు, నేనుగూడ, ఆస్తిక భావనతో దేనిని ఆలోచించనని స్పష్టం చేయదలచుకొన్నాను. నావరకు భావన అనేది చారిత్రకంగా నిబంధితము (conditioned). ఈ నిబద్ధిత భావన ద్వారా, మానవుడు తన ఉన్నత శక్తులకు సంబంధించిన అనుభవాన్ని, ఒక ప్రత్యేక చారిత్రక దశలో సత్యం కోసం, ఐక్యతకోసం అతడు పడ్డ తపనను వ్యక్తంచేశాడు. శుద్ధ ఏకేశ్వరోపాసన ఫలితాలు, ఆస్తిక వ్యతిరేక పారమార్థిక చింతన (non-theistic ultimate concern) - ఈ రెండు వేరైనప్పటికి, అవి కొట్టుకోవలసిన పని లేదని నా నమ్మకము.

ఈ దశలో దైవప్రేమ సమస్యకు సంబంధించిన మరొక అంశం నిష్పన్నమవుతున్నది. సమస్య అనుపానులు తెలుసుకోవడానికి దీనిని మనం చర్చించాలి. పాక్, భారత, చైనా పశ్చిమాల మత దృక్పధాలలోని ఒక ప్రాధమిక బేధాన్ని చెబుతాను; ఈ బేధాన్ని తార్కిక భాషలో వ్యక్తం చేయవచ్చు; అరిస్టాటిల్ కాలం నుంచి పాశ్చాత్యం అతని తర్కాన్నే అనుగమించింది. ఈ తర్కం "A" అంటే "A", అనే తాదాత్మ్యన్యాయం మీద, 'A' అంటే 'non-A' కాదు. అనే విరుద్ధ న్యాయం మీద, 'A' అంటే 'A', 'non-A';ల ఉభయమూ కాదు, తదను భయమూ కాదు, అనే మధ్యేమార్గ నిషేధ ధర్మంమీద ఆధారపడింది. అరిస్టాటిల్ తాను చెప్పదలచుకొన్నది ఈ క్రింది వాక్యంలో స్పష్టంగా చెప్తాడు. అదేవస్తువు అదే వస్తువుకు అదే కాలంలో అదే అంశంలో చెంది ఉండడం, చెందకుండ ఉండడం అసంభవము. తార్కిక అభ్యంతరాలను పరిహరించడానికి, ఏమైన ఇతర భేదాలను కలపవలసి వస్తే కలపవచ్చునుగాక. అలాంటప్పుడు, ఇది అన్ని సూత్రాలలోకి నిశ్చితమైంది (certain).... (సశేషం)

*

* *

*

"ప్రేమించడం ఒక కళ" పుస్తక రూపంలో
'పల్లవి' పబ్లికేషన్స్ వారిచే ప్రచురింపబడింది.
ఏలూరు రోడ్, విజయవాడలో లభ్యమగును.

*

* *

*

***"Terrorism has arrived in India with all its evil consequences".***

# ప్రకృతి పింఛం విప్పింది - సైన్స్ దుర్భిణి వేసింది

- ఎన్. ఇన్నయ్య

ఆధునిక విజ్ఞానాన్ని సులభంగా చెప్పాలంటే ఉపమానాలు, పోలికలు తీసుకరావాలి. అలా తెస్తే అర్థమైనట్లే వుంటుంది గాని, విషయం కొంత పలచబడుతుంది. కాని అంతకు మించి ప్రస్తుతం మరో మార్గం కనిపించదు.

స్టీఫెన్ హాకింగ్ ఎంత సీరియస్ శాస్త్రజ్ఞుడో, అంత హాస్య ప్రియుడు కూడా. మరణానంతరం కూడా శాశ్వతంగా అమరత్వం పొందాలని చాలా మంది భావిస్తుంటారు. అది దృష్టిలో పెట్టుకొని కాబోలు, హాకింగ్ బ్లాక్ హోల్స్ గురించి ప్రస్తావించినప్పుడు అంటాడు: కావాలంటే బ్లాక్ హోల్స్‌లో పడిన వ్యక్తి అమరత్వం పొందవచ్చు. కాని అతడు రూపాంతరం చెంది, రేడియేషన్‌గా మాత్రమే మిగులుతాడు. అదే పదివేలు అని తృప్తిపడితే సరేసరి! అని వ్యాఖ్యానించాడు. ఇలాంటి వెన్నో అతడు రాసిన సంక్షిప్త కాలచరిత్రలో గమనించవచ్చు.

అద్భుత శాస్త్రజ్ఞుడుగా పేరొందిన స్టీఫెన్ హాకింగ్‌ను 1981లో పోప్ దగ్గరకు తీసుకెళ్ళారు. పరిణామాన్ని గురించి పరిశీలించడం సరేసరి. కాని బ్రహ్మాండం బద్దలైన తీరు గురించి పట్టించుకోవద్దు. అదే దైవసృష్టి అని పోప్ అన్నాడట. అంతకు ముందే ఒక సెమినార్‌లో హద్దులు లేని విశ్వం పరిమితమైనదనీ, ఇందులో సృష్టి లేదనీ, దైవం ప్రసక్తే రాదనీ హాకింగ్ మాట్లాడి వెళ్ళాడట!

ఈ విశ్వం 20 బిలియన్ సంవత్సరాల క్రితం పెద్ద ప్రేలుడుతో (బిగ్ బాంగ్) ఆరంభమైందని చెబుతున్నారు. అప్పటినుండీ విశ్వం విస్తరిస్తూ పోతున్నది. ఇదెలా చెప్పగలరు? నక్షత్రాల నుండి వచ్చే కాంతి ఎర్రగా కనిపిస్తున్నది. అవి దగ్గరగా జరుగుతుంటే నీలం రంగు కనిపిస్తుంది. దూరంగా పోతుంటే ఎర్రరంగు వుంటుంది. చాలాకాలం చాలా పరిశోధనలు చేసిన అనంతరం ఎడ్విన్ పోవెల్ హబల్ (1889-1953) అలా సిద్ధాంతీకరించి, ఆకాశంలో తారలన్నీ పరస్పరం దూరంగా జరిగి పోతున్నాయన్నాడు.

ఇప్పుడు నక్షత్రాలన్నీ దూరదూరంగా పోతున్నాయంటే ఒకప్పుడు దగ్గరగా వున్నాయన్నమాట. అలా వెనక్కుపోయి, బ్రహ్మాండం బ్రద్దలయ్యే దగ్గర ఆగారు. జార్జి గమోఫ్ (1904-1968) పెట్టిన బిగ్ బాంగ్ అనే మాట సైన్స్‌లో నానుడిగా మిగిలింది. ఈ విశ్వం స్వయం సంపూర్ణమని, దీనికి హద్దులు, ఎల్లలు, అంచులు లేవని సైన్స్ పేర్కొంటున్నది. అలాంటి విశ్వానికి ఆది లేదు. అంతం లేదు. కనుక అందులో సృష్టికర్తకు చోటు లేదని హాకింగ్ అన్నాడు.

పెద్ద ప్రేలుడుతో ఆరంభమైన విశ్వం, ఆ క్షణం నుండీ విస్తరిస్తూ పోతున్నది. తొలిదశలో వున్న వేడి, క్రమేణా విస్తరణ వలన తగ్గుతున్నది.

విశ్వమంతా పరిణామక్రమంలో వుంది. నక్షత్రాలు, పాలపుంతలు, గ్రహాలు అలా పరిణమిస్తున్నవే. పెద్ద ప్రేలుడుతో ప్రారంభమై, పరస్పరం దూరమౌతూ పోతున్న పదార్థం అనేక తారల్ని ఏర్పరచింది. పరిణామంలో అనేక నక్షత్రాలు పుట్టాయి, గిట్టాయి. ఇలా జరగడానికి ఒక్కొక్క తారకు 10 మిలియన్ సంవత్సరాలు పడుతుంది. ఒక్కొక్క నక్షత్రం వేగంగా పయనిస్తూ, బరువెక్కి, తన బరువుకు తానే కుంగిపోతుంటుంది. అలా జరిగినప్పుడు ఎంతో కాంతి వెదజల్లుతుంది. ఈ పరిణామంలో మన సూర్యుడు ఉత్తరోత్తరా ఆవిర్భవించాడు. 5 బిలియన్ సంవత్సరాల క్రితం మన సూర్యుడు జనించాడు. అందులో నుండే గ్రహాలు పుట్టాయి. వాటిలో భూమి ఒకటి.

నక్షత్రాలు పుడుతున్నాయి, గిడుతున్నాయి. సూర్యుడు కూడా ఒక నక్షత్రమే. మనం సూర్య మండలంలోనే వున్నాం. అయితే సూర్యుడు గిట్టడానికి ఇంకా మిలియన్ల సంవత్సరాలున్నవి. కనుక తక్షణం భూమిమీద ప్రాణానికి ముప్పు లేదు. ఇంతకూ నక్షత్రాలు పుట్టడం అంటే ఏమిటి?

విశ్వంలో వున్న హైడ్రోజన్ గ్యాస్ గురుత్వాకర్షణ వలన, అతివేగంగా తరచుగా ఢీకొని వేడెక్కుతుంది. ఈ వేడి పెరిగిపోయి హీలియం పుడుతుంది. అప్పుడు జనించే సెగ, భుగభుగల్నే నక్షత్ర కాంతి అంటున్నాం. అలా ఏర్పడిన తారలు కొంతకాలం పాటు వెలుగునిస్తూ వుండిపోతాయి. నక్షత్రంలో ఎంత ఎక్కువ పదార్థం వుంటే, అంత వేడెక్కుతుంది. వేడి అధికమైతే అందులోని ఇంధనమంతా ఖర్చవుతుంది. అలా చూస్తే మరో 5 వేల మిలియన్ సంవత్సరాలకు సరిపడే ఇంధనం మన సూర్యుడిలో వుంది. ఇంధనం ఖర్చయితే, తార చల్లబడుతుంది. కుంచించుకపోతుంది. అలాంటి నక్షత్రాలు విశ్వంలో ఎన్నో వున్నాయి. వీటినే అంధకార నక్షత్రాలంటున్నారు. బ్లాక్ హోల్స్ అన్నమాట!

## చీకటి తారలు!

బ్లాక్ హోల్స్ వున్నాయా? చూస్తేగాని నమ్మను అన్నాడట ఒక సైంటిస్టు! కనిపిస్తే వాటిని బ్లాక్ హోల్స్ ఎందుకంటాం? కాని అలాంటివి వున్నాయని ఎలా తెలుసు? స్టీఫెన్ హాకింగ్ కృషి వలన బ్లాక్ హోల్స్ ఉన్నాయని తేలింది.

బ్లాక్ హోల్ వున్నదని గురుత్వాకర్షణ వలన కనుగొన్నారు. గురుత్వాకర్షణ అంటే ఒన్ వే ట్రాఫిక్ వంటిది. ఇది ఆకర్షిస్తుందే గాని, తిప్పికొట్టదు. బ్లాక్ హోల్ బలం వలన, అందులో పడినదేదీ ఇక బయటకు వచ్చే సమస్య రాదు. ఏదైనా సరే, చివరకు కాంతి కిరణంతో సహా, ఛిన్నాభిన్నమై పోతుంది. ఇంతకూ బ్లాక్ హోల్స్‌లో పడిన పదార్థం హరించుకపోయిన తరువాత ఏమౌతుంది? రేడియేషన్‌గా వస్తుంది. పదార్థం సృష్టి కాదు. రూపాంతరం చెందుతుంది అనే సూత్రానికి యిది సరిపోతుంది. పెద్ద తారలు వెలుగు కోల్పోయి, బ్లాక్ హోల్స్‌గా మారి, తమంతట తాము తిరుగుతూ కొన్ని, స్థిరంగా కొన్ని వున్నాయంటున్నారు.

ఆకాశంలో ఒక పరిశోధకుడు రాకెట్‌లో బయలుదేరి వెళ్ళాడనుకోండి. మరొక రాకెట్‌లో వున్న వారికి అతడు ఎప్పటికప్పుడు సంకేతాలను పంపిస్తూ వుంటే, అతడు

ఎక్కడ వున్నదీ, ఎటు వెడుతున్నదీ తెలుస్తుంటుంది. 10 గంటల 59 నిమిషాలు 59 సెకండ్ల వరకూ సంకేతాలు అందుతూ, 11 గంటలకు సంకేతాలు రావడం ఆగిపోయిందనుకోండి. బ్లాక్ హోల్‌లో పడిన (ఆకర్షితుడైన) రోదసీ పరిశోధకుడి జాడ తెలుసుకునే అవకాశమే లేదన్నమాట. అతడు పూర్తిగా ఛిన్నాభిన్నమై పోతాడు.

బ్లాక్ హోల్స్‌ను అధ్యయనం చేయడానికి మనకు తెలిసిన శాస్త్రీయ నిబంధనలు చాలవు. కనుక ఇంకా వేచి వుండవలసి వస్తున్నది. రెండు నక్షత్రాలు సమీపంలో వుంటే, అందులో ఒకటి వెలుగుతున్న తార అయితే, మరొకటి బ్లాక్ హోల్ అయితే, రెండూ పరిభ్రమిస్తూ వుంటాయి. వెలుగుతున్న నక్షత్రం వెదజల్లేదంతా కొంతకాలం బ్లాక్ హోల్ పరిసరాల్లో తిరిగి, చివరకు అందులో పడిపోతుంది. అప్పుడు ఎక్స్‌రేలు, గామా కిరణాలు ప్రసరిస్తాయి. ఖగోళ శాస్త్రజ్ఞులకు యిదొక చక్కని వివరణ అయింది.

సూర్యుని పరిణామం కంటె పెద్దదైన తారలు వెలుగు కోల్పోయి బ్లాక్ హోల్స్‌గా మారిన తరువాత అందులో ఏ పదార్థం వుందో, అదెలా పరిణమిస్తున్నదో ఏమీ తెలియడం లేదు. పూర్తిగా నలుపు అయితే, వేడి కూడా వుండడానికి వీల్లేదు కూడా. కాని మనకు తెలిసిన తారలు, నియమబద్ధంగా కొన్ని పార్లు ప్రవర్తించకపోడానికి యీ బ్లాక్ హోల్స్ కారణం కావచ్చు ననుకుంటున్నారు. ఐన్‌స్టైన్ పేర్కొన్న సాపేక్షతా సిద్ధాంతం వలన, గురుత్వాకర్షణ సూత్రాల వలన యిలాంటి బ్లాక్ హోల్స్ వుండవచ్చునని భావించడానికి దారితీసింది.

సూర్యుని కంటె చిన్న బ్లాక్ హోల్స్ వుంటే, వాటిలో సెగ వుండే అవకాశం వుందని హాకింగ్ భావించాడు. సెగ వుంటే దానితోపాటు కొంత వెలుగు సైతం వుండొచ్చునంటున్నాడు. ప్రస్తుతానికి బ్లాక్‌హోల్స్ అనేవి సైన్స్‌లో వింత గాధగానే చెప్పుకుంటున్నారు. బ్లాక్ హోల్స్‌ను తెలుసుకోడానికి గామా కిరణాలను పరిశీలిస్తే సరిపోతుందని హాకింగ్ చెబుతున్నాడు. అదేమంత సులభం కాదు. మన భూమి వాతావరణంలోకి గామా కిరణాలు చొచ్చుకరావు గనుక, ఆకాశంలో వాటిని పట్టుకునే యంత్రాల్ని అమర్చాలి. ముమ్ముందు యిది సాధ్యం కావచ్చునేమో.

## కాలజ్ఞానం

కవల పిల్లల్లో ఒకర్ని ఆకాశంలోకి పంపిస్తే అతడు కాంతి వేగంతో 20 ఏళ్ళు తిరిగొస్తే, భూమిమీద వున్న అతని సోదరుడు ముసలివాడై వుంటాడు. ఆకాశాన్ని చుట్టి వచ్చినవాడు యింకా చిన్నవాడుగానే కనిపిస్తాడు. సైన్స్‌లో ఇదొక వింతగా చెప్పుకుంటారు. ఇదెలా సాధ్యం?

ఐన్‌స్టైన్ సాపేక్షతా సిద్ధాంతంతో మన కాలజ్ఞానం మారిపోయింది. ఎవరు ఎక్కడ వుండి గమనించినా సరే, కాంతి వేగం ఒక్క తీరులోనే వుంటుందని రుజువైంది. సెకండ్ కు లక్ష 86 వేల మైళ్ళ వేగంతో కాంతి కిరణం పయనిస్తుంది. దీనిప్రకారం సెకండ్ క్రింద చంద్రుడ్ని చూస్తున్న మనం 8 నిమిషాల క్రితం వున్న సూర్యుణ్ణి చూస్తున్నాం. సూర్యుడి నుండి వెలుగు భూమిమీదకు చేరడానికి 8 నిమిషాలు పడుతుందంటే, కాంతి కిరణాలను బట్టి దూరాన్ని కొలుస్తున్నామని గ్రహించాలి. మనం చూస్తున్న తారలు, అతి దగ్గరలో వున్నవి 4 కాంతి సంవత్సరాల నాటివి!

ఇప్పుడు కవలల విషయం చూద్దాం. భూమిమీద వున్న తను, ఆకాశంలో కాంతి వేగంతో

రాకెట్‌లో వెళ్ళేవాడు చెరొక గడియారం పెట్టుకుంటారు. అయితే ఇరువురు ఒకరి విషయం మరొకరు తెలుసుకోవడానికి వారు పంపుకునే కాంతి సంకేతాలే ఆధారం. ఆకాశంలో వెడుతున్నవాడు దూరమయ్యే కొద్దీ, కాంతి సంకేతాలు కూడా ఆలస్య మౌతుంటాయి. మనం ఒకచోట నిలుచుంటే, కారు దగ్గరగా వస్తుంటే శబ్దం పెరుగుతూంటుంది. మనకు దూరంగా కారు వెడుతుంటే శబ్దం సన్నగిల్లుతుంది. శబ్ద తరంగాల వలన యీ మార్పు, దూరాన్ని బట్టి, తేడాగా వున్నట్లనిపిస్తుంది. ఇదే కాంతికి అన్వయిస్తే, మనకు దగ్గరగా వస్తుంటే నీలి రంగులోనూ, దూరంగా పోతుంటే ఎరుపు రంగులోనూ వుంటుంది. క్రిస్టియన్ డాప్లర్ అనే ఆస్ట్రియన్ శాస్త్రజ్ఞుడు (1803-1853) యీ విషయాలను పేర్కొన్నాడు. అందుకే డాప్లర్ ప్రభావంగా యీ అంశాన్ని చెబుతుంటారు. ఇది కవలలకు వర్తిస్తే సరి. ఉభయులూ సంకేతాలు పంపుకోవడమే తప్ప, పరస్పరం కంటితో చూచేటంత సమీపంలో వుండరు గదా.

కవలలు చెరొక గడియారం పెట్టుకున్నారన్నాం గదా. ఆకాశంలో వెళ్ళినవాడు ఆకాష్ అనుకుంటే, భూమిమీద వున్నవాడిని పృథ్వి అందాం. 'ఆకాష్' 10 కాంతి సంవత్సరాలు ప్రయాణం చేస్తే, అతడి సంకేతాలు పృథ్వికి చేరడానికి 10 ఏళ్ళు పడుతుంది. ఆకాష్ గడియారంలో 4.84 సంవత్సరాలుగా చూపుతుంటే, పృథ్వి గడియారంలో 21.2 సంవత్సరాలు చూపుతుంది. అంటే ఆకాష్ వెళ్ళిన 1.1 సంవత్సరానికి పృథ్వికి సంకేతాలు చేరతాయి. పృథ్వి కాలం ప్రకారం 22.2 సంవత్సరాలకు ఆకాష్ తిరిగి వస్తాడు. రాకెట్‌లో ప్రయాణం చేస్తున్న ఆకాష్‌కి యిదంతా 4.36 సంవత్సరాలుగా కనిపిస్తుంది.

ఆకాష్ గనుక 9.7 సంవత్సరాలకు తిరిగి వస్తే, పృథ్వికి 22.2 సంవత్సరాలు గడచిపోయినట్లు. అంటే పృథ్వి 12.5 సంవత్సరాలు పెద్దవాడైపోయాడన్నమాట. పట్టిక పరిశీలించండి:

| ఆకాశంలోకి (సంవత్సరాలలో) | | | తిరుగు ప్రయాణం | |
|---|---|---|---|---|
| | భూమి గడియారం | రాకెట్ గడియారం | భూమి గడియారం | రాకెట్ గడియారం |
| ఆకాష్ | 1.1 | 4.84 | 21.1 | 4.84 |
| పృథ్వి | 21.1 | 4.84 | 1.1 | 4.84 |

మొత్తం ప్రయాణం రాకెట్ గడియారం ప్రకారం 9.7 సంవత్సరాలు భూమిపై గడియారం ప్రకారం 22.2 సంవత్సరాలు. ఇందులో ఆకాష్ తన తిరుగు ప్రయాణంలో వేగం పెంచి 1.1 సంవత్సరంలో వచ్చేస్తాడు. రాకెట్‌లోని ఆకాష్‌కు 4.36 కాంతి సంవత్సరాల కాలం, పృథ్వి దృష్టిలో 10 కాంతి సంవత్సరాలుగా వుంటుంది.

సాపేక్షతా సిద్ధాంతం పేర్కొన్న విషయాలు అద్భుతాలుగా అగుపించినా, వీటిని పరిశోధనా పూర్వకంగా గమనించారు. కాలం కుంచించుక పోవడం యిలాంటి అద్భుతమే. కాలం అంటే విశ్వ చరిత్రే. విశ్వమంతా ప్రదేశం. ఇవి రెండూ కలిసే వుంటాయి. విడిగా చూడడానికి వీల్లేదు. అదే ఐన్‌స్టీన్ పేర్కొన్న మరో సత్యం. కాలం గురించి, ప్రదేశం గురించి మనకున్న పాత భావాల్ని మార్చుకొనక తప్పలేదు.

కాలాన్ని గురించి హాకింగ్ మరికొన్ని విశేషాలు వివరించాడు. బల్లమీద కప్పు వున్నదనుకోండి. అది క్రమం కిందపడి పగిలిందనుకోండి. అది క్రమం తప్పడం. విశ్వమంతటా క్రమం నుండి అక్రమానికి పోతున్నదే వాస్తవం. ఇదే కాలగమనం. క్రమంగా వుండడం,

క్రమరాహిత్యత క్షీణించడం అంటే ఎలా వుంటుందో హాకింగ్ సోదాహరణగా చెప్పాడు. పగిలిన కప్పు దానంతట అదే మళ్ళీ అతుక్కొని, యథా స్థానానికి రావడం క్రమం తిరగ బెట్టడం! ఇది జరగడం లేదు. విశ్వం ఒకప్పుడు క్రమంగా వుంటూ, క్రమేణా క్రమరాహిత్యానికి పోతున్నది.

మనం జీవించాలంటే ఆహారం స్వీకరించాలి. ఇలా స్వీకరించడం క్రమం. ఆహారాన్ని శక్తిగా మార్చడం క్రమరాహిత్యం. అలా కాకుంటే మనం బ్రతకం. విశ్వంలో ఎల్లలు లేవని ఐన్‌స్టీన్ సాపేక్షతా సిద్ధాంతం పేర్కొన్నది. ఇందులోనే క్రమ రాహిత్యతకు అవకాశం వచ్చింది. విశ్వం విస్తరిస్తుంటేనే మనం వుంటాం. కుంచించుకపోతే, మనం పోతాం. కుంచించుకపోయే విశ్వంలో పగిలిన కప్పులు మళ్ళీ అతుక్కుపోతాయి. విశ్వమంతా మరోసారి చిన్నదై పెద్ద పేలుడు సంభవించక ముందు ఎలా వుండేదో, ఆ దశకు చేరుతామన్న మాట. సాపేక్షతా సిద్ధాంతం పేర్కొంటున్న అవధులు లేని విశ్వంలో మళ్ళీ కుంచించుక పోవడం జరగకపోవచ్చని హాకింగ్ భావిస్తున్నాడు. మనం నమ్మే క్రమత్వం యీ విశ్వంలో పరిమిత ప్రాంతానికి చెందింది. క్రమరాహిత్యత విశ్వవ్యాప్తంగా వుంది. ఈ వ్యాసంలో ప్రతిమాట గుర్తుంచుకుంటే, మెదడులో జ్ఞాపకశక్తి పెరిగి, క్రమత్వం విస్తరించినట్లే. కాని యీ వ్యాసం చదివేలోగా ఒక వెయ్యి కాలరీల ఆహారశక్తిని క్రమరాహిత్య శక్తిగా మార్చారనే సంగతి తెలుసుకోండి. చెమట పోయడం, బొగ్గుపులుసు వాయువు బయటకు పంపడం మనం కూడా విశ్వంలో క్రమరాహిత్యతకు దోహదం చేస్తున్నామని విస్మరించవద్దు!

## విశ్వంలో ఏ శక్తులున్నాయి?

మనకూ చంద్రుడికీ 4 లక్షల మైళ్ళ దూరం వుంది. మనకూ సూర్యుడికీ 9 కోట్ల 30 లక్షల మైళ్ళ దూరం వుంది. అయినా మన సూర్యమండలంలో ఇవి పరస్పర సంబంధంతో వుంటున్నాయి. ఇంకెంతో దూరాన వున్న నక్షత్రాలు, పాలపుంతలు పరస్పర సంబంధంతో పరిభ్రమిస్తున్నాయి. ఇదెలా సాధ్యం? అంటే గురుత్వాకర్షణ వలన అని గ్రహించారు. ఇందులో ఆకర్షణే తప్ప, తిప్పికొట్టడం వుండదు. పెద్ద ప్రేలుడుతో (బిగ్ బాంగ్) విశ్వం విస్తరించడం మొదలైనప్పుడు, మొదట పనిచేయ నారంభించింది గురుత్వాకర్షణ శక్తే. అయినా యింతవరకూ యీ శక్తిని పరిశోధనాత్మకంగా పట్టుకోలేక పోయారు. జోసెఫ్ వెబర్ అనే శాస్త్రజ్ఞుడు అమెరికాలో గురుత్వాకర్షణ తరంగాలను కనుగొన్నాడని ప్రకటిస్తే సైన్స్‌లోకంలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. కాని అలాంటి పరిశోధనలు ఇతర చోట్ల చేస్తే ఫలితాలు రాలేదు. కనుక ఇంకా వేచి వుండాల్సిందేనన్నమాట. అయితే గురుత్వాకర్షణ వుందని అనుభవం చెబుతున్నది. ఒక వస్తువును ఎగరేస్తే కిందకు వచ్చి పడడానికి గురుత్వాకర్షణే కారణం. చాలా బలంగా ఒక వస్తువును విసిరేస్తే సెకండ్ కు 7 మైళ్ళ వేగంతో పైకి పంపించగలిగితే, భూమి గురుత్వాకర్షణ శక్తికి దాటిపోతుంది. అప్పుడది భూమికి తిరిగిరాదు.

గురుత్వాకర్షణ గురించి సాపేక్షతా సిద్ధాంతం ద్వారా ఐన్‌స్టీన్ నిర్దుష్టంగా లెక్కలు వేసి చెప్పాడు. విశ్వవ్యాప్తంగా గురుత్వాకర్షణ శక్తి వుంది. నక్షత్రం నుండి భూమికి వచ్చే కాంతి కిరణాలు సూర్యుని వద్ద వంపు తిరుగుతున్నాయి. ఐన్‌స్టీన్ చెప్పిన యీ విషయాన్ని గ్రహణం పట్టినప్పుడు పరిశీలించి, వాస్తవమని తేల్చారు. ఇలా వంపు తిరగడానికి సూర్యుని గురుత్వాకర్షణ కారణం అన్నారు. అలాగే ఎక్కువ పదార్థం గల చోట గురుత్వాకర్షణ పనిచేస్తున్నది.

విశ్వంలో మరో శక్తిగా, విద్యుదయస్కాంతం వున్నది. అణువులు కలసి వుండడానికి, ఇది ఉపకరిస్తున్నది. ఇందులో ఆకర్షించే గుణం వున్నట్లే, తిప్పికొట్టే లక్షణం కూడా వుంది. ఐన్‌స్టీన్ కాలం నాటికి తెలిసినవి యీ రెండు శక్తులే. ఇవి స్థూల ప్రపంచానికి చెందినవి. అతరువాత సూక్ష్మ లోకం తలుపులు తెరుచుకున్నాయి. దీన్నే తేజ కణ సిద్ధాంతం (క్వాంటం) అన్నారు. ఇది అణువులు, ఎలక్ట్రాన్లు, ప్రోటాన్లు మొదలైన వాటికి చెందిన శాస్త్రం. ఇందులో అణుకేంద్రాలకు (అటమిక్ న్యూక్లియస్) చెందిన బలీయశక్తిని కనుగొన్నారు. స్ట్రాంగ్ రియాక్షన్ కేంద్ర స్థానంలో కణాల్ని కలిపి వుంచే యీ శక్తి చాలా దగ్గర స్థానంలో ($10^{-13}$ సెంటీమీటరు) పనిచేస్తుంది. ఇది కనుగొన్న జపనీస్ శాస్త్రజ్ఞుడు యుకావాకు 1949లోనూ, పావెల్ అనే శాస్త్రజ్ఞుడికి 1950లోనూ నోబెల్ బహుమానాలు లభించాయి. అతరువాత మరో శక్తి కూడా వున్నదని కనుగొని, దీనికి బలహీన శక్తి (వీక్ ఇంటరియాక్షన్) అని నామకరణం చేశారు. రేడియో ధార్మిక శక్తికి సంబంధించిన యీ శక్తి సూర్యుని వెలుగుకు కారణమని, దీనివలననే భూమిపై మన జీవితం సాధ్యమైందని గ్రహించాలి.

శక్తి హెచ్చుగా వున్న చోట విద్యుదయస్కాంతం, బలహీన శక్తి పనిచేస్తుండగా, బలవత్తర శక్తి పనిచేయడం లేదు. కాని యీ మూడు శక్తులూ కలసిపోయే అవకాశాన్ని కనుగొన్నారు. ఐన్‌స్టీన్ కలలుగన్న ఐక్యతా సిద్ధాంతం చాలా వరకు ఫలించిందన్నమాట. కాని గురుత్వాకర్షణ శక్తి ఇంకా వీటితో కలపలేక పోతున్నారు. కనుక ఐక్యత అసంపూర్తిగానే వున్నది. అయితే సూక్ష్మ లోకానికి చెందిన కణాలు, అణువులకు గురుత్వాకర్షణ శక్తి అవసరం లేదు గనుక, అక్కడ పూర్తి ఐక్యత లేకున్నా ఫరవాలేదంటున్నాడు. కాని స్థూల ప్రపంచంలో గురుత్వాకర్షణ ప్రాధాన్యత దృష్ట్యా, దీనిని కలుపుకొని ఐక్యతా సిద్ధాంతం నిర్మించాలి. అదింకా గగన కుసుమంగానే మిగిలింది.

ఐక్యతా సిద్ధాంతం వలన విశ్వం ఎలా పనిచేస్తున్నదో సులభంగా తెలుసుకోవచ్చు. అది లేనంతకాలం విశ్వంలో ఎక్కడికక్కడ అన్వయించే సిద్ధాంతాలతో సరిపెట్టుకోవలసి వస్తున్నది.

స్థూల ప్రపంచంలో సాపేక్షతా సిద్ధాంతం వున్నది. కార్యకారణ సంబంధం పనిచేస్తున్నది. కాని సూక్ష్మ లోకంలో అందుకు భిన్నంగా క్వాంటం (తేజఃకణ) సిద్ధాంతం చెబుతున్నది. అక్కడ కార్యకారణ సంబంధాలు దెబ్బతిన్నాయి. అస్థిరత్వం వచ్చింది. స్థూల ప్రపంచంలో ఒకానొక వస్తువు ఎక్కడ వున్నదో తెలిస్తే, ఉత్తరోత్తరా ఎటుపోతుందో అంచనా వేయగలుగుతున్నారు. ఇది నిర్ధారణ పద్ధతి. సూక్ష్మలోకంలో ఎలక్ట్రాన్ ఎక్కడ వున్నదీ, తెలిసినా ఎటుపోతుందో చెప్పలేం. ఎటు పోతున్నదీ గ్రహించినా ఎక్కడ వుంటుందో వూహించలేం. ఈ అనిశ్చిత కేవలం పరిశోధకుల పరిమిత జ్ఞానం వలన రాలేదు. పరికరాల వలనా రాలేదు. అనిశ్చిత అనేది సూక్ష్మలోక స్వభావం అని తేలింది. హైసెన్‌బర్గ్ అనే శాస్త్రజ్ఞుడు యిది కనుగొన్న తరువాత, ఐన్‌స్టీన్ ఒక పట్టాన యిందుకు సమ్మతించ లేకపోయాడు. సాపేక్షతా సిద్ధాంతానికే, అనిశ్చితతో కూడిన క్వాంటం (తేజః కణ) సిద్ధాంతానికీ ముడి పెట్టాలని విఫల ప్రయత్నం చేశాడు. అలాంటి పని నేడు స్టీఫెన్ హాకింగ్ చేస్తున్నాడు. దీనివలన విశ్వం పుట్టినది మొదలు నేటివరకూ అనేక అంశాలు విప్పి చెప్పవచ్చని ఆయన భావిస్తున్నారు.

## (యాంటి మేటర్) వ్యతిరేక పదార్థం:

అద్దంలో చూస్తే మన ప్రతిబింబం కనిపిస్తుంది. అదే నిజలోకంలో మన వ్యతిరేక బింబం మన ఎదుట నిలిస్తే, పొరపాటునైనా షేక్‌హాండ్ ఇచ్చేవు సుమా! ఖర్చయిపోతావన్నాడు చమత్కారంగా స్టీఫెన్ హాకింగ్. పదార్థంతో వ్యతిరేక పదార్థం తారసిల్లితే, రెండూ హరించుక పోతాయి. రెండు అలలు ఢీకొంటే, రెండూ పోయి, ప్రశాంతంగా నీరు మిగులుతుంది. అయితే అణువులు, ఎలక్ట్రాన్లు వాటి వ్యతిరేకమైన వాటితో తారసిల్లితే, హరించుకపోతే, తర్వాత ఏం మిగులుతోంది? పదార్థం రూపం మారుతుందే కాని, నాశనం కాదన్నారు సైన్స్‌లో. ఆ మాట వాస్తవమే. పదార్థ-వ్యతిరేక పదార్థ తాకిడిలో రేడియేషన్ పుడుతుంది. గామా కిరణాలు వస్తాయి. ఇది పరిశోధనాత్మకంగా తేల్చారు.

ఎలక్ట్రాన్‌కు వ్యతిరేకంగా యాంటి ఎలక్ట్రాన్ వుందని, దీనికి పాజిట్రాన్ అని నామకరణం చేద్దామని శాస్త్రజ్ఞుడు డిరాక్ 1932లో చెబితే, అతడికి 1933లో నోబెల్ బహుమతి యిచ్చారు. ప్రతి కణానికి వ్యతిరేక కణం వున్నది. పరిశోధనలో తేలిన యీ వాస్తవాలు, లోకంలో భారీగా వున్నాయేమో ఇంకా తెలియదు. మనకు తెలిసిన ప్రపంచమంతా పదార్థమ యమే. వ్యతిరేక పదార్థంతో కూడిన నక్షత్రాలు, పాలపుంతలు వుంటే, వాటికీ మన విశ్వానికే యింకా పరస్పర సంకేతాలు ఏర్పడలేదు.

రెండు విరుద్ధ కణాలు ఢీకొన్నప్పుడు హరించిపోయేది ఎలక్ట్రిక్ చార్జ్ మాత్రమే. ద్రవ్యరాశి (మాస్) రూపాంతరం చెంది గామా కిరణాలుగా పరిణమిస్తున్నది.

శక్తి పదార్థంగా మారుతున్నప్పుడు, కణాలు - వ్యతిరేక కణాల జంటలు ఏర్పడుతు న్నాయి. పదార్థం శక్తిగా మారుతున్నప్పుడు అణ్వాయుధ బాంబు ప్రేలుడు వంటివి జరుగుతాయి. ప్రస్తుతం సూర్యుడిలో ఇలా పదార్థం కాస్తా శక్తి మారుతూ, ప్రతి సెకండుకు 4 మిలియన్ టన్నుల పదార్థం శక్తిగా రూపాంతరం చెందుతున్నది.

ఒకసారి ఒక శాస్త్రజ్ఞుడు విశ్వాన్ని గురించి ఉపన్యాసం చెబుతుంటే, ఒకామె లేచి, నీవు చెప్పేదంతా సరైంది కాదు. ఈ విశ్వమంతా ఒక తాబేలుపై వున్నది అని హిందూ శాస్త్రం చెబుతున్నది. అదే బాగున్నది అన్నదట. ఆ శాస్త్రజ్ఞుడు వెంటనే: బాగానే వుంది గాని, తాబేలు దేనిపై వుంది? అని అడిగాడట. అంతే. ఆమెకు నోట మాట రాలేదు. శాస్త్రీయంగా పరిశీలించినప్పుడు నిలబడకపోతే, పురాణ గాథల్ని కేవలం కట్టు కథలుగానే స్వీకరించాలి. ఈ విషయాన్ని హాకింగ్ ప్రస్తావించి, తాబేలుపై వున్న విశ్వం అంచుకి పోతే, పడిపోతామని, ఐన్‌స్టీన్ విశ్వ సిద్ధాంతంలో అంచులు లేవని గుర్తు చేశాడు.

ప్రపంచంలో క్రమబద్ధంగా సూర్యోదయం, గ్రహాల చలనం చూచి, శాస్త్రీయంగా నిర్ధారణ అయ్యాయని, నియమబద్ధత వుందని భావించారు. ఈ నియమాలు ఎలా ఎంపిక చేసుకోవాలి, తొలుత అవి ఎట్లా ప్రారంభమయ్యాయి అనే విషయం లాప్లేస్ అనే శాస్త్రజ్ఞుడు వివరించలేక పోయాడని హాకింగ్ గుర్తు చేశాడు. ఆ తరువాత క్వాంటం సిద్ధాంతం (తేజఃకణ) వచ్చి, స్థితి-గతి ఒకేసారి కచ్చితంగా అంచనా వేయలేమని, అనిశ్చిత వాదాన్ని తెచ్చింది. వెలుగు కిరణాల్ని, అణువుల కణాల్ని సూటిగా దూసుకవెళ్ళే బాణాల వంటివిగా కాక, తరంగాలుగా చూస్తే అంచనాలు కుదురుతున్నాయి. అయినప్పటికీ నియమాలు, తొలిదశ ఎలా వచ్చిందో యింకా చెప్పలేక పోతున్నామని హాకింగ్ పేర్కొన్నాడు.

గురుత్వాకర్షణ వలన విశ్వం ప్రస్తుతం విస్తరిస్తుండగా, ఒకప్పుడు కుంచించుకొని వుండేదని, యీ బ్రహ్మాండం బద్ధలైనప్పటి నుండీ, కాలం మొదలైందని స్టీఫెన్ హాకింగ్ సిద్ధాంతీకరించాడు.

సైన్స్‌లో ఎదుర్కొంటున్న చిక్కులు విప్పడానికి, సాపేక్షతా సిద్ధాంతంతో తేజఃకణ సిద్ధాంతాన్ని (క్వాంటం) సమన్వయిస్తే సరిపోతుందన్నాడు. ఇన్నాళ్ళూ విశ్వం ఏమిటో వివరించడానికి ప్రయత్నించారు. విశ్వం ఎలా వచ్చిందోనన్న ప్రశ్న కూడా యిప్పుడు వేసుకోవాలి. సమగ్ర వివరణ లభించినప్పుడు అందరికీ ఆ సూత్రాలు తెలుస్తాయి. మనం, ఈ విశ్వం ఎందుకున్నదో అప్పుడు చర్చించుకోవచ్చునన్నాడు.

హాకింగ్ చమత్కారానికి మరో ఉదాహరణతో యీ వ్యాసం ముగిస్తాను. ఈ విశ్వాన్ని సృష్టించక ముందు భగవంతుడేం చేసేవాడు? అంటే, ఇలాంటి ప్రశ్నలేసే వాళ్ళకోసం నరకాన్ని సృష్టించే పనిలో వున్నాడని సెయింట్ ఆగస్టీన్ అనే కేథలిక్ తాత్వికుడన లేదన్నాడు! ★

---

# బాబాల గారడీ

## అరటిపండులో ఉంగరము చూపుట

ప్రదర్శనము చూడవచ్చినవారి కడనుండి యొకయుంగరమును దీసికొని దానినొక బరిణిలోనుంచి అల్లలనాడించిన నది గలగలమని ధ్వనిచేయును. తరువాత నాయుంగరమును వేరొకపాత్రలో బెట్టెదనని చెప్పుచు నాయుంగరమును జాగ్రత్తగా నీ మేజాబల్లపై నుంచుము. నీకు సహాయకారిగా వచ్చిన నీమిత్రు డాయుంగరమును మెల్లగా లోనికిగొని పోయి ముచిక దగ్గరనుండి అరటిపండులోనికి దూర్చి నెమ్మదిగా సభికుల చూడకుండ నేదోపనిమీద వచ్చినట్లా అరటిపండును బల్లపై నుంచి పోవును. ఈలోపల నీవు సభికులతో చమత్కారప్రసంగము చేయుచుండుము. తరువాత నీవు ఉంగరమునుంచిన పాత్రమీద చేతిరుమాలు కప్పి యాపాత్రను సభికులకుజూపి, అయ్యా! చూడండి. ఈపాత్రలో నుంగరము చిత్రముగా మాయమయినదని చెప్పుచు పాత్రనాడింపుము. ఆ పాత్రచప్పుడు కాకపోవుటవలన యుంగరమెట్లు మాయమయినదని ప్రేక్షకులాశ్చర్యమందుదురు. అప్పుడు నీవు 'బాబులారా! చూడండి! ఆ పాత్రతో మాయమయిన ఉంగరము నీయరటిపండులోనికి దెప్పింతు'నని యేవో మంత్రములను జదువుచు నీమంత్ర కోల నాపాత్రపయినున్న రుమాలుమీద పెట్టి అరటిపండునుదీసి సభికులలో నొకనిచేతికిచ్చి 'దీనిలో నుంగరముదీయండి' అనుము. అత డాపండులోని యుంగరమును దీయగా సభికులందరు తెల్లబోయి ఆశ్చర్యమగ్ను లగుదురు. ఆ యుంగరము యెవరిదో వారికిచ్చివేయుము.

*

* *

*

# స్వప్న శిల్పము - ధ్వని

- డాక్టర్ జి.వి. కృష్ణరావు

మానవునకు నిద్రా స్వప్నాలు తక్కిన ఉన్నతశ్రేణి జంతు జాలానికి వలెనే స్వాభావికాలు. అయితే ఈ స్వప్నాలు ఎందుకు వస్తున్నవి? స్వభావ స్వరూపాలు ఏమిటి? అన్న ప్రశ్నలను గూర్చి అతడు ఎప్పుడు ఆలోచించటం మొదలుపెట్టాడో తెలియదు. కాని వీటి ప్రస్తావన ఉపనిషత్తులలోను, దర్శనాలలోను, వైద్య శాస్త్ర గ్రంథాలలోను, పురాణేతిహాసాలలోను కనిపిస్తున్నది.

జాగరితస్థానో బహిష్ప్రజ్ఞః సప్తాంగ ఏకోనవింశతి ముఖః స్థూలభుగ్ వైశ్వానరః ప్రథమః పాదః; స్వప్నస్థానో  ఽన్తః ప్రజ్ఞః సప్తాంగ ఏకోనవింశతిముఖః ప్రవివిక్తభుక్ తైజసోద్వితీయః పాదః; యత్రసుప్తోన కంచన కామం కామయతే నకంచన స్వప్నం పశ్యతి తత్సుషుప్తం సుషుప్త స్థాన ఏకీభూతః ప్రజ్ఞాన ఘన ఏవానందమ యోహ్యానందభుక్ చేతో ముఖః ప్రాజ్ఞః తృతీయః పాదః — అని మాండూక్య మంటున్నది. అంటే బ్రహ్మమైన ఆత్మకు ప్రథమ పాదము వైశ్వానరుడు. ఈ వైశ్వానరుడు జాగరిత స్థానుడు. బహిష్ప్రజ్ఞుడు. ఈతనికి ఏడు అంగాలు. 19 ముఖాలున్నవి. ఇతడు స్థూల భుక్కు. రెండవ పాదము తైజసుడు. ఇతడు స్వప్నస్థానుడు. అంతః ప్రజ్ఞుడు. ప్రవివిక్తభుక్కు, మూడవ పాదం ప్రాజ్ఞుడు. ఇతడు సుషుప్తస్థానుడు, సుషుప్తుడైవుండి ఇతడు ఏ కోరిక కోరటం లేదు. ఏ స్వప్నాన్ని పొందటం లేదు. ఆనందఘన రూపుడై ఆనందం అనుభవిస్తున్నాడు. ఇతడు చేతో ముఖుడు అని మాండూక్యం అభివర్ణిస్తున్నది.

''కరణోపరమే జాగ్రత్సంస్కా రార్థ ప్రబోదవత్
గ్రాహ్య గ్రాహక రూప స్ఫురణం స్వప్నావస్థా భవతి
తత్ర విశ్వ ఏవ జాగ్రద్వ్యవహారలోపా న్నాడీచరం
తైజసత్వ మవాస్య వాసనా రూపకమ్
జగద్వై చిత్ర్యం స్వభానాభాసయన్ యథేప్సితం

స్వయంభుంక్తే

అని సై ంగలోపనిషత్తు అభివర్ణిస్తున్నది. అంటే స్వప్నావస్థలో ఇంద్రియాలు విరతి పొందుతున్నవి. జాగ్రదవస్థలో పొందిన సంస్కారార్థాలు, గ్రాహ్య గ్రాహక రూప స్ఫురణతో మేలుకొంటున్నవి. ఈ అవస్థ యందు విశ్వుడే జాగ్రద్వ్యవసార లోపంవల్ల నాడీ చరమైన తైజసత్వం పొంది, తన కాంతిచే వాసనా రూపకమైన జగద్వైచిత్రాన్ని భాసింప జేస్తూ యథేప్సితంగా తనకు తాను అనుభవిస్తున్నాడు -అని ఈ ఉపనిషత్తు స్వప్నాన్ని గూర్చి వ్యాఖ్యానిస్తున్నది. వైద్య గ్రంథాలు కొన్ని రకాల కలలు వ్యక్తి ఆరోగ్యాన్ని, కొన్ని రకాల కలలు అనారోగ్యాన్ని సూచిస్తవని చెబుతున్నవి. ఈ వ్యావహారిక ప్రపంచం స్వప్న ప్రపంచం వంటిదే కాని పరమార్థ సత్యం కాదు అని చెప్పటానికి మాధ్యమికులు కలలను దృష్టాంతరీకరిస్తూ వచ్చారు. కలలు రానున్న శుభాశుభాలను సూచిస్తాయని వివరించే ఘట్టాలు పురాణేతిహాసాలలో ఎన్నో ఉన్నాయి. ఈనాటికీ ఈవిషయాన్ని నమ్మి దుస్స్వప్నాలకు శాంతి చేయించుకోవాలని చెప్పేవారు ఎందరో ఉన్నారు. ఏది ఎలా ఉన్నా, స్వప్నాలలో కనిపించే

విచిత్రరూపాలు, అద్భుత చర్యలు, అతి లోక వృత్తాలు చూచి అవి లోకోత్తరాలనీ, జాగ్రదవస్థతో వీటికి సంబంధం లేదని భావించడం సహజమే.

అయితే, మన ప్రాచీన శాస్త్రకారులు జాగ్రదవస్థకూ, స్వప్నావస్థకూ ఉన్న కార్యకారణ భావం గుర్తించక పోలేదు. కాని, స్వప్నాలు ఎందుకు వస్తాయి? ఎలా వస్తాయి? వైచిత్రి ఎందుకు ఏర్పడుతున్నది? వీని ఆంతర్యం ఏమిటి? జాగ్రదవస్థలతో వీనికున్న సంబంధం ఏమిటి? - అన్న విషయాలను గూర్చి విశదంగా ఆలోచించినట్లు కనబడదు.

స్వప్న స్వరూప స్వభావాలను గూర్చి, శిల్పాన్ని గూర్చి మొదటిసారిగా వివరించినవాడు సిగ్మండ్ ఫ్రాయిడ్ . అతడు 1909లో మొదటిసారిగా స్వప్నాలను వ్యాఖ్యానిస్తూ ఉపన్యాసా లిచ్చాడు. ఆ తరువాత యుంగ్, యాడ్లర్ మున్నైనవారు మరికొన్ని విశేషాలను వివరించారు.

ఫ్రాయిడ్ సిద్ధాంతం ప్రకారం ఆత్మను మూడు భాగాలుగా విభజించవచ్చును. 1. వైశ్వానరము (Conscious), 2. తైజసము (Preconscious), 3. ప్రాజ్ఞము (Unconscious), మానవుడు నిద్రపోతున్నప్పుడు వైశ్వానరం పనిచేయదు. అది కూడ నిద్రపోతుందని చెప్పవచ్చు. అంటే జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు పనిచేయక పోవటంవల్ల అహం అంతర్ముఖ మవుతుంది. అందువల్ల దేశ కాలాలు జారిపోతాయి. జాగ్రదవస్థలో ఉన్నప్పుడు ప్రాజ్ఞంలో దాగిఉండే వాసనల ఇష్టాలను, తనకు అంగీకరించరాని వాటిని వైశ్వానరం అణచివేస్తుంది. ఇలా అణచివేయబడి జాగ్రదవస్థలో సిద్ధి చేకూర్చు కోలేని ఈప్సితార్థాలు స్వప్నావస్థలో విహారానికి బయలుదేరుతవి. గడచిన రెండు మూడు రోజుల్లోని అముఖ్య సంఘటనలనే గుర్రాలు వీటికి వాహనాలు. ఈ సంఘటనల్లో సాధారణంగా అవాంతరాలవల్ల ఆపివేసిన ఆలోచనలుకాని, ఆలోచించే ఓపిక లేక వదలివేయబడినవి కాని, అసలు వైశ్వానరంలోకి రానీకుండా తైజసం త్రొక్కిపట్టిన ఆలోచనలుకాని, అముఖ్యంగా కనిపించటంవల్ల జాగ్రదవస్థలో అపరిష్కృతంగా ఉండిపోయిన ఆలోచనలు కాని ఉంటవి.

స్వప్న భావాలన్నీ ఆత్మాశ్రితాలే. కలకనేవాడు కలకు నాయకుడు.

అపారే కావ్య సంసారే కవి రేవ ప్రజాపతిః యథాస్మై రోచతే విశ్వం తథేదం పరివర్తతే- అని ధ్వనికారుడు ఉట్టంకించాడు. ఇది అక్షరాల స్వప్నానికి అన్వయిస్తుంది. స్వాపియే స్వప్న కథానాయకుడు. అతని అవ్యక్త ఈప్సితార్థానుగుణంగా స్వప్న ప్రపంచం పరివర్తనం పొందుతుంది.

ఇక్కడ ఒక సందేహం కలుగవచ్చును. కొన్ని కొన్ని కలల్లో స్వాపి కనిపించడే. అలాంటి కలలకు స్వాపి నాయకుడు ఎలా అవుతాడు? అవి ఆత్మాశ్రితాలు ఎలా అవుతాయి?

వేరొకప్పుడు అతని వెనుక మరొక వ్యక్తి దాగియుండవచ్చును. స్వాపి ఆ మరొక వ్యక్తికీ, తనకూ నిగూఢ సాధర్మ్యం ఉన్నదని భావించి, దానిని తనకు ఆపాదించుకొనటానికి ఇలా చేస్తాడు. మరొక ప్పుడు కలలో స్వాపి ఉంటాడు; ఇతర వ్యక్తులు ఉంటారు. అయితే జాగ్రత్తగా పరిశీలించినపుడు ఇతర వ్యక్తులు స్వాపి రూపాంతరాలు కాని అన్యులుకారు. బెర్నార్డ్‌షా నాటకాలలో ఈ తత్త్వమే గోచరిస్తుంది. దాదాపు అతని తైజశాంసం ఆమోదించిన విభిన్న భావాలున్నప్పుడు ఇలాటి విభిన్న రూపకల్పన జరుగుతుంది.

ఇదంతా నిజమే కావచ్చు. కాని అసలు ప్రశ్న అలాగే ఉన్నది. ఇష్టావాప్తే స్వప్నాల పరమ ప్రయోజనమైతే స్వప్నాలన్నీ సుఖప్రదంగా ఉండాలి. కోరుకున్న కోరిక నెరవేరినప్పుడు, సంతోషం

భగ్నమైనప్పుడు దుఃఖం కలగటం సహజంకదా? అలాంటప్పుడు కొన్ని స్వప్నాలు సుఖప్రదంగాను, కొన్ని దుఃఖకారులుగాను, కొన్ని తటస్థంగాను ఎందుకు ఉంటున్నవి? పీడకలలు ఎందుకు వస్తున్నవి? చెట్లు నడుస్తున్నట్లు, మానవులు ఆకాశంలో ఎగురుతున్నట్లు, సింహం మాట్లాడుతున్నట్లు, అగ్ని చందన శీతలంగా ఉన్నట్లు స్వప్నాలలో చూడటం కద్దు. ఇలాంటి లోక విరుద్ధదృశ్యాలు, అనుభవాలు ఎలా కలుగుతున్నవి?

స్వప్నం నిద్రాభంగం పొడమనీకుండా చూస్తుంది. అందువల్ల ప్రాజ్ఞాంశంలో దాగియున్న తీరని కోరికలను పురస్కరించుకొని బయలుదేరే దృశ్యాలను, భావాలను వైశ్వానరంలో ప్రవేశించకుండా ఆ భావాలకు అనుగుణమైన చర్యలను జ్ఞానకర్మేంద్రియాలకు వైశ్వానరం ఆదేశించవలసిన అవసరం రాకుండా చేయటానికి తైజసం నిరోధిస్తుంది. అందువల్ల స్వప్న భావాలు, దృశ్యాలు తైజసానికి లోబడి దాని ఆమోదం కోసం క్లుప్తీకరణ (condensation) వ్యత్యయీకరణం (Displacement) మిలితీకరణం (combination) విపర్యయీ కరణం (Invertion) సంకేతీకరణం (symbolization) పొందుతవి. వికల్పభావాన్ని స్వప్నం చిత్రించలేదు. అందువల్ల వికల్ప విషయాలను ఒకదాని ప్రక్క మరొక దానిని చేరుస్తుంది. పోలికలను కదుపులను చెప్పవలసివస్తే పోలికలున్న వాటి నన్నిటిని ఒకటిగాను, కదుపును ఒకదాని ద్వారాను చూపిస్తుంది. అందువల్ల స్వప్నంలోని అర్థాలు, దృశ్యాలు విచిత్రంగా, అలౌకికంగా కనిపిస్తాయి. వాస్తవానికి వుత్తమ కావ్యంలో వాచ్యార్థం ఒకటీ తద్విలక్షణమైన వ్యంగ్యార్థం మరొకటి వుంటున్నట్లే, స్వప్నంలో కూడా వ్యక్తార్థం ఒకటి, అంతరార్థం మరొకటి వుంటాయి. వాచార్థం ఒక్కొక్కప్పుడు అన్వయాదిక్లేశం లేక సామాన్యంగా వుంటుంది. రాజుగారి పెద్ద భార్య పతివ్రత అన్నప్పుడు అన్వయ క్లేశం లేదు. అయితే చిన్న భార్య శీలవతి కాదన్న వ్యంగార్థం స్ఫురిస్తూనే వున్నది. మరొకప్పుడు వాచ్యార్థం అన్వయం పొందక విడ్డూరంగా వుంటుంది. వుదాహరణకు అమ్మబోతే అడవి, కొనబోతే కొరివి అన్న వాక్యమే తీసుకోవచ్చు. అమ్మకానికీ అడవికీ, కొనడానికీ కొరివికీ సంబంధం ఏమిటి అని తోస్తుంది. నిర్జనారణ్యంలో వస్తువును అమ్మాలంటే ఎవరు లభిస్తారు? కొరవిని పట్టుకోలేము. పట్టుకుంటే కాల్చివేస్తుంది. అలాగే కొనటం అసాధ్యము అన్న అర్థం భాసిస్తుంది. అలాగే అభివ్యక్త స్వప్నం ఒక్కొక్కప్పుడు సర్వసామాన్యంగా వుంటుంది. వేరొకప్పుడు విడ్డూరంగా అలౌకికంగా వుంటుంది. వుదాహరణకు యీ అభివ్యక్త స్వప్నాలనే తీసుకోవచ్చును.

ఒక స్త్రీ తన స్తనవల్కలం స్తన్యసిక్తమైనట్లు కలగన్నది. మరొక పాశ్చాత్య వనితకు తన 15 ఏండ్ల కూతురు చనిపోయినట్లూ, ఆ దేహం తన ఎదుటి పెట్టెలో వున్నట్లూ కలవచ్చింది. ఈ స్వప్నాలలో ఇష్టావాప్తి జరిగిందా? వీని అంతరార్థం ఏమిటి?

మొదటి కలగన్న ఆవిడ తిరిగి గర్భం తాల్చింది. మొదటి కాన్పులో బిడ్డకు పాలిచ్చుకొందామంటే తెల్లజీర కూడా కనిపించలేదు. ఈ మలి కాన్పునకైనా బిడ్డకు పాలిచ్చుకోగలనా అని ఆందోళన పడుతున్నది. అలాంటి తల్లికి కలిగే కోర్కె ఏమిటి? స్తన్యసంవృద్ధే కదా? అదే స్వప్నంలో వ్యక్తమైంది. సంగతి సందర్భాలు స్వప్న స్వరూపం. తెలిసిన వారికి వాచ్యార్థంగా వున్న అభివ్యక్త స్వప్నం ఆమె వితర్కాన్ని ఆక్షప్తం చేస్తున్నది.

ఇంక రెండవ కల అభివ్యక్త రూపం దారుణంగా కనిపించక తప్పదు. ఏ తల్లి తన కన్నబిడ్డ చావుకోరుకుంటుంది? స్వప్నం ఇష్టావాప్తి సూచకమన్న సిద్ధాంతం ఏలా నిలుస్తుంది? దీని అంతరార్థం ఏమిటి?

ఇక్కడ ప్రకరణాదిక జ్ఞానం అవశ్యకం. ఈ రెండవ కలగన్నది జర్మనీ గృహిణి. ఈ కలగనటానికి

ముందరి సాయంకాలం స్నేహితురాండ్రు బాక్స్ అన్న ఆంగ్ల పదానికున్న అర్థాన్ని గూర్చి చర్చించు కొంటూ వుంటే ఆమె విన్నది. జర్మన్ భాషలో పేటికను చెప్పే విభిన్న పదాలు చర్చకు వచ్చాయి. ఆ గృహిణికి పేటికార్థాన్ని చెప్పే జర్మన్ గ్రామ్య పదం తోచివుంటుంది. ఆ గ్రామ్య పదానికి పేటిక అనీ స్త్రీ గుహ్యాంగమనీ అర్థం. పేటికలో శిశువు అంటే గర్భకోశంలో శిశువు. ఆమెకు తాను గర్భవతి కావటం ఇష్టం లేదు. పుట్టక ముందే శిశువు చనిపోతే బాగుండునని ఆ గర్భమేర్పడిన రోజుల్లో అనుకొనేది. వాస్తవానికి ఆ రోజుల్లో కడుపును పిడికిటి పోటులతో పీడించింది. అయితే ఆ కోరిక 15 ఏండ్ల క్రిందటిది. తరువాత ఆమెలో ఎన్నో మార్పులు వచ్చాయి. ఇంతకూ ఈ స్వప్నం 15 సంవత్సరాల క్రిందటి కోర్కెను వ్యక్తం చేస్తున్నది.

ఇంతకూ చెప్పుకోవలసింది ఏమంటే, స్వప్నంలో ఉత్తమ కావ్యంలో వలెనే రెండు అంశాలు ఉంటవి. (1) అభివ్యక్త స్వప్నం, దీనినే ఫ్రాయిడ్ manifest dream అన్నాడు. ఇది కావ్యంలోని వాచ్యార్థం వంటిది. వాచ్యార్థం గ్రహించినంత మాత్రాన కావ్యాత్మ అర్థం కాదు. అందుకనే ధ్వనికారుడు-

"శబ్దార్థ శాసన జ్ఞాన మాత్రేణైవ న వేద్యతే
వేద్యతే సహి కావ్యార్థ తత్త్వజ్ఞై రేవ కేవలమ్"

అంటున్నాడు. వ్యాకరణము, కోశము గ్రహించినంత మాత్రాన కావ్యార్థం అవగతం కాదు. ప్రకరణాదికం వూహించగలిగిన సహృదయునకే అది అర్థం అవుతుంది. అలాగే అభివ్యక్త స్వప్నంలోని అంతరార్థం (Latent Dream content) స్వప్న స్వరూప స్వభావాలు స్వాపి జీవితాది ప్రకరణం తెలియని వానికి బోధపడవు. కనుక కావ్యార్థానికి స్వప్నార్థానికి సామ్యం ఉంది. అందుకనే రసగంగాధర కర్త "విభావాదీనామపి స్వప్న తురగాదీనా మివ, రంగరజ తాదీనామివ సాక్షి భాస్యత్వము విరుద్ధమ్" అని పేర్కొన్నాడు. అయితే పండితరాయలు విభావాదులు స్వప్న తురగాదులు విరుద్ధాలు కావని పేర్కొన్నాడే కాని, ఒకటేనని చెప్పలేదు. ఎందువల్లనంటే, శిల్పంలో స్వప్నార్థాలు, కావ్యార్థాలు ఒకటే అయినా కొంత తేడా ఉన్నది. స్వప్నార్థాలు స్వాపిగతాలు. కావ్యార్థాలు సామాజికాలు, ఈ విభేదాన్ని గ్రహించలేక పాశ్చాత్య సాహిత్యంలో బయలుదేరిన ప్రతిధ్వనులు వెర్రితలలువేసి అయోమయత్వంలో పడిపోయాయి. ఈ సందర్భంలో గుర్తింపవలసిన అంశం మరొకటి వున్నది. స్వప్నం కేవలం స్మృతి కాదు. అయితే స్మృతిలేక స్వప్నం వుండదు. ఇష్టావాప్తికై తైజసాంశ శాసన బద్ధమైన స్మృతి యోజనం స్వప్నం, అలాగే భావ్యమానమైన కావ్యార్థం వర్ణ్య వర్ణు మున్నైనవారు పేర్కొన్నట్లు స్మృతి కాదు. దండి పేర్కొన్నట్లు కావ్యం ఇష్టార్థ వ్యవచ్ఛిన్న పదావళి మాత్రమే.

ఇంతకూ స్వప్నార్థాలు అతి సంగ్రహంగా విచిత్రంగా వుండటానికి కారణాలు ఆత్మలోని తైజసాంశము విధించే శాసనాలను పాటించటానికై ప్రాజ్ఞాంశంలో నుంచి బయలుదేరే ఈ ప్సితార్థాలు క్లుప్తీకరణానికి, వ్యత్యయీ కరణానికి, మిలితీకరణానికి, విపర్యయీకరణానికీ పాల్పడుతాయి. వీటివల్ల స్వప్నార్థాలు విచిత్రంగా లోకోత్తరంగా కనిపిస్తవి. ఈ శబ్దమే కావ్యంలో ధ్వని అవుతున్నది. క్లుప్తీకరణాదికానికి తేజస వాసనం ఏలా కారణమో కావ్యంలోని ధ్వనికి ఔచిత్యం అలా కారణం. అసలు తైజసం లేకపోతే స్వప్నమే భగ్నమై పోతుంది. అలాగే ఔచిత్యం లేకపోతే కావ్యమే వుండదు. అందుకనే ధ్వనికారుడు "అనౌచిత్యాదృ తే నాన్య ద్రస భంగస్య కారణమ్" అన్నాడు. కాగా స్వప్న శిల్పమూ, ధ్వనీ అవిరుద్ధాలు. ★

# నెహ్రూ - గాంధీ సంస్థానం

పుస్తక సమీక్ష

**నెహ్రూ కుటుంబంపై ఇదొక సమీక్షా వ్యాసం. ఇందులో వివిధ రచయితలు వ్రాసిన పుస్తకాలు సమీక్షించినందున ఇతివృత్తం ఒక పద్ధతి ప్రకారం (coherent) ఉండకపోవచ్చు. అయితే, నెహ్రూ-గాంధీ కుటుంబ సంస్థాన పాలన అంతర్లీనంగా వ్యాసం అంతటా ఉంటుంది.**

సమీక్షకుడు:

మాకినీడి సూర్య భాస్కర్

జవహర్‌లాల్ నెహ్రూ జన్మ శతాబ్దిని పురస్కరించుకొని ఎన్నో పుస్తకాలు వెలువడ్డాయి. జాతీయ అంతర్జాతీయ సదస్సులు జరిగాయి. వాటివివరాలు పుస్తకాలరూపంలో వెలువ డ్డాయి. ఈ సాహిత్యాన్నంతనీ - ఆరాధనా పూర్వకమైనదిగాను, విమర్శనాత్మక మైనది గాను - రెండు భాగాలుగ విభజించవచ్చు. మహాత్ముని మూర్తీభవించిన అసంస్కరణ వాదంగా, ఆర్థిక అరాచకత్వంగా, ధర్మకర్తృత్వ ఆదర్శంగా, సంకుచిత జాతీయ దృక్పథంగా వర్ణిస్తూ, నెహ్రూను శాస్త్ర విజ్ఞాన వాదప్రతిమగా, లౌకిక ప్రజాస్వామ్య సామ్యవాద ప్రతిమా రూపునిగా, ప్రణాళికా బద్ధమైన ఆర్థికాభివృద్ధిగా, అంతర్జాతీయ దృక్పథం కలవానిగా వర్ణిస్తూ, ముఖ్యంగా గాంధీ నెహ్రూలను ద్విధావ్యతిరిక్తంగా పోలుస్తూ ఉందీ సాహిత్యం యావత్తూ. ఒక్క మాటలో చెప్పాలంటే సాంప్రదాయానికీ నవ్యతకూ మధ్య పోలికగా సాగింది. అయితే అసలు నిజం మాత్రం ఈ రకమైన వర్ణనలకంటె గాంధీ, నెహ్రూలిద్దరూ అధికులు. భారతమాత పుత్రుని గౌరవప్రపత్తులు పెంచే నిమిత్తం జాతిపితను కురుచ చేయనవసరం లేదు.

నెహ్రూను సమర్థించేవారు అర్థ సత్యాలను నమ్ముతూ యిద్దరికీ అన్యాయం చేయడంతో రెండు తప్పులు చేస్తున్న వారౌతున్నారు. ధనాధికార వాంఛ, సైనికీకరణ, ప్రజోపాంతీకరణ, పాశ్చాత్య పాదార్థిక సంస్కృతి క్షీణతల ఫలితంగా రెండు ప్రపంచ యుద్ధాలూ జరిగాయి. ఈ లోపాన్ని సరిదిద్దడం కోసం గాంధీ అసంస్కరణాత్మమూ, పూర్తిగా భారతీయమూ కానటువంటి నైతిక శక్తిని ఉపయోగించాడు. సత్యంతో ఆయన చేసిన ప్రయోగాలు శాస్త్రీయ మైనవీ, తార్కికమైనవీనూ. ప్రాచ్యపాశ్చాత్య తత్త్వాలకు రెంటికీ చెందిన ఒక నైతిక దైవత్వాన్ని గాంధీ అనుసరించాడు. భారత పారిశ్రామిక వేత్తలు అనుకొనే విధంగా గాంధీ పారిశ్రామికీకర ణకు వ్యతిరేకి కాదు. ప్రజా బాహుళ్య దారిద్ర్యాన్ని రూపు మాపడంలో గాందీవిధానం, భారీ పరిశ్రమలు, అణుశక్తి ప్రజోపయోగంతో కూడిన నెహ్రూ విధానానికి పూర్తిగా భిన్నమైంది.

కేంబ్రిడ్జి నుంచి సైన్సులో ఆనర్స్ డిగ్రీ తీసుకున్నవాడు. పాశ్చాత్య పదార్థ అభ్యున్నతిని ఆరాధించేవాడు, హోమిభాభా, భట్నాగర్ వంటి శాస్త్రజ్ఞుల స్నేహితుడు అయిన నెహ్రూ భారతదేశంలో శాస్త్రీయ విప్లవానికి నాంది పలికాడు. గాంధీ హిందూ పునరుజ్జీవనానికి

మతాన్ని రాజకీయంగా ఉపయోగించిన వానిగా చిత్రించ బడ్డాడు. ఆయన మతపరంగా కంటె, ఆధ్యాత్మికంగా కంటె కూడ ఎక్కువగా నైతిక వాది. ఆయన సన్యాసం నిస్సందేహంగా ప్రజల్ని సమ్మోహితుల్ని చేయగలిగింది. అయినా కాని, ఆయన కులతత్వానికి, హరిజన దేవళ ప్రవేశ అయోగ్యతకు, అన్నిటికంటె మిన్నగ అస్పృశ్యతకు వ్యతిరేకి. అధిక సంఖ్యాకులైన హిందువుల మతవాంఛలను తిరస్కరించని గాంధీ, ముస్లిం సేవకుల చేతివంటను తినడానికి సంసిద్ధుడు. ఆయన ప్రార్థనా గీతం ఈశ్వరునీ, అల్లాను స్తుతిస్తుంది. అంతేకాకుండ, ఆయన భారతీయ ముస్లింల మనోభావాలు కనుగుణంగా విదేశీయమైన ఖిలాఫత్ ఉద్యమాన్ని ప్రోత్సహించాడు. బెంగాల్లో హిందూ ముస్లిం వర్గాల మధ్య తలెత్తిన తగాదాలను పరష్కరించడానికి విరివిగా తిరిగాడు. ముస్లింల పట్ల ఆయనకున్న ఈ మెత్తని వైఖరే పాకిస్థాన్ విభజన సమయంలో ఆయన ప్రాణాలను బలిగొంది.

నెహ్రూ లౌకికవాదం పాశ్చాత్యం. భారతదేశంలో ఆచరణాత్మకమైంది కాదు. పైగా కృతకమైంది. రాజ్యాంగం అన్నిమతాల పట్ల మతసహనం కలిగి ఉండాలి. అధిక సంఖ్యాకవర్గమైన హిందువుల క్షమ, త్యాగం ద్వారా అల్ప సంఖ్యాక వర్గమైన ముస్లింల అభిరుచులను సంరక్షించవలసిన అవసరం ఉందని నెహ్రూ భావించాడు. అందుకే హిందువులకు న్యాయ చట్టాన్ని రూపొందించాడు. నెహ్రూ శకం హైందవ జీవితదృక్పథాన్ని అనవసరంగా నలుపు చేసి ముస్లిం గొప్పను పోషించింది.

గాంధీ మధ్య తరగతి ప్రజల పక్షపాతి అనే ముద్ర వేయబడ్డాడు. పంటపొలాలు, ఫ్యాక్టరీలతో కూడిన ఆయన భారతదేశ భావన - ముఖ్యంగా చరఖా, నూలు వడకటంతో కూడిన స్త్రీ గ్రామీణోద్యోగికత, హరిజనుల కోసం ఆయన ఆరాటం - ప్రజాబాహుళ్యం నమ్మినవానిగా గాంధీని తీర్చిదిద్దిన ఈ అంశాలన్నీ ఆయనను, సమ సమాజ స్థాపన కోసం బోల్షివిక్కు సోషలిజాన్ని దిగుమతి చేసుకుని భారతీయాత్మను దాని తాలూకు సిద్ధాంతంతో ఐక్యమొందించడంగా దర్శించిన నెహ్రూ తదితరుల వర్గంలో చేర్చారు. భారతదేశ స్థితికి పనికిరాని విధంగా నెహ్రూ సోషలిజం, "సగం స్వేచ్ఛా పూరితం, సగం మార్క్సిస్టు సూత్రంపై ఆధారపడిన 'మిశ్రమ ఆర్థిక విధానం' పేరిట పెట్టుబడిదారీ విధానంతో ఎన్నోరకాలుగా సర్దుకు పోయింది, హోదాగల కుటుంబంలో పుట్టడంవల్ల జనబాహుళ్యంతో తనకున్న దూరాన్ని బట్టి నెహ్రూ కాంగ్రెస్ పట్ల ప్రజలకున్న అభిమానాన్ని వదులుకునే ప్రయత్నం చేయలేదు. పూర్ణ స్వరాజ్యం, సోషలిజం, లౌకిక తత్వం, ప్రజాస్వామ్యం, ఆర్థిక పునర్నిర్మాణం వంటి విషయాలలో నెహ్రూకు, గాంధీకి అభిప్రాయ భేదాలున్నా, నెహ్రూ ఎప్పుడూ గాంధీకి ఆంతరంగిక అనుచరునిగానే ఉండిపోయాడు. పాలకవర్గంతో నెహ్రూ కున్న సాహచర్యం వల్ల, పాలన బదిలీ సమయంలో పొరబాటులేని విధంగా ఆంగ్లంలో భాషించగల చాతుర్యం కలిగి ఉన్న పాశ్చాత్యీకృత మధ్యవర్తిగా గాంధీ నెహ్రూను తన అనుయాయిగా ఎంచుకొన్నాడు.

కాంగ్రెస్ 1928లోనే ఆర్థిక తీర్మానాన్ని చర్చించినా, 1938 లోనే సుభాష్ చంద్రబోస్ ఈ భావనను చక్కగా విశదపరచినా, భారతదేశ వలసపాలన, స్వతంత్ర పాలనలకు సంబంధించిన ప్రణాళికా బద్ధ ఆర్థిక విధాన పరపతి నెహ్రూకే దక్కింది. పాశ్చాత్య, భారతదేశ జీవన ప్రమాణాల మధ్య ఎంతో అంతరం ఉండడం నెహ్రూను అప్రతిభుణ్ణి చేసింది. పాశ్చాత్య పెట్టుబడిదారీ, సోవియట్ రాజ్యైక, చైనా కమ్యూనిటీ ఆధారిత ప్రణాళికలను పరిశీలించి,

ఇంగ్లండు, స్వీడన్, పోలండ్ , అమెరికా, రష్యాలనుంచి ఎంతోమంచి ఆర్థిక నిపుణులను రావించి, చివరికి భారీ పరిశ్రమల ప్రభుత్వ రంగంలోను, చిన్న తరహా ప్రైవేటురంగ పరిశ్రమలతోను, వినియోగదారీ వస్తూత్పత్తి చేసే సహకార రంగ పరిశ్రమలతోను కూడినట్టి రష్యాతరహా కేంద్రీకృత ఆర్థిక విధానాన్ని ఎంచాడు. దీని ఫలితంగా, విదేశీ సాంకేతికతపైన, విదేశీ ఋణాలపైన ఆధారపడిన, ప్రజలందరికీ చాలిన ఉద్యోగావకాశాలు కల్పించలేని, ఈ నాటికీ జాతీయార్థికరంగాన్ని పట్టి కుదిపివేస్తున్న స్వయం వినాశక ప్రభుత్వ ఏకస్వామ్యం తయారైంది. 'చిన్నదే అందం' అన్న సూత్రానికి అంటి పెట్టుకొన్నందు వల్ల, శ్రామికాధార గ్రామీణ పరిశ్రమలతో కూడిన ఆర్థిక పునర్నిర్మాణం గురించి నొక్కి చెప్పినందుకు గాంధీ ఆర్థిక అరాజకవాదిగా చిత్రీకరించ బడ్డాడు. కానీ, ఈ విధానం నెహ్రూ దేనినైతే కాదని నిరసించి తిరిగి 1950లలో పునరాలోచించాడో ఆ చైనావిధానానికి దగ్గరైనది.

దక్షిణాఫ్రికా అనుభవాలు, న్యాయవాద శిక్షణార్థం ఇంగ్లండ్ వెళ్లడం తప్పిస్తే, స్వాతంత్ర్యం కోసం తీవ్రమైన పోరాటం కారణంగా గాంధీ భారతదేశానికి మాత్రమే పరిమితమయ్యాడు. అయినా కానీ, ఆయన విశ్వమానవ సందేశం ప్రపంచానికే వారసత్వమైంది. నెహ్రూకు నిజంగా అంతర్జాతీయ అవగాహన ఉంది. అంతేకాక గాంధీవలె కాక నెహ్రూకు ఫాసిస్టు వ్యతిరేకత వలస రాజ్యవ్యతిరేకత కంటె కూడ అధికం. ప్రచ్ఛన్న యుద్ధకాలంలో నెహ్రూ తృతీయ ప్రపంచాన్ని అలీనంగా ఉంచే ప్రయత్నం చేసాడు. నెహ్రూకు పాశ్చాత్య పెట్టుబడిదారీ ప్రజాస్వామ్యం, ఆఫ్రికాసియాలపైన దాని నాయకత్వం, నియంత్రణ గిట్టేవి కావు, అందుకే, సాంకేతిక జ్ఞానానికి, పరపతి బదలాయింపుకు, రాయబార సైనిక ఒడంబడికలకు సోవియట్ కూటమివైపు మొగ్గు చూపాడు. సోవియట్ సాంకేతిక జ్ఞానం ద్వితీయ మైనదైనా, ఆ దేశం భారతదేశపు ముడి సరుకును యూరప్ వినియోగార్థం తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నా, పట్టుబడిదారీ దేశాలవలె ఆ దేశం కూడ తూర్పు ఐరోపా దేశాలపై పెత్తనం వహిస్తున్నా - ఈ అన్ని తప్పిదాలను నెహ్రూ గుర్తించనట్టు ఉండిపోయాడు. పాశ్చాత్య శక్తులకు అది నచ్చకపోవడంతో అవి పాకిస్థాన్‌తో స్నేహ సంబంధాలేర్పరచుకొని భారతదేశానికి తీవ్ర సరిహద్దు సమస్యను తెచ్చిపెట్టాయి. కమ్యూనిస్టు దేశాలలో చీలిక వచ్చిన తర్వాత సోవియట్ రష్యాతో భారతదేశానికున్న సంబంధం రీత్యా, 1962లో చైనా మన ఈశాన్య సరిహద్దును తాకింది. అయితే, భారతదేశం శక్తిపరంగా చైనాతో తూగలేకపోయింది. అలీన విధానం మొదట్లో కాగితంపులి మాత్రమే. క్రమేణా తృతీయ ప్రపంచ సభ్యులలో దానికొక గుర్తింపు వచ్చి, అంతర్జాతీయ శాంతి చర్చల్లో దాని మాటకొక విలువ వచ్చింది.

నెహ్రూ భారతదేశాన్ని పాశ్చాత్యీకరించడంలో కొంత మంచి ఉంది; కొంత చేటూ ఉంది. చాలవరకు అది కృతకమూ, భారతదేశ పరిస్థితికి సరిపోనిదీ. సిద్ధాంతాలు వాటిని భేదించిన పుడే గౌరవింప బడుతాయి. లేనిపక్షంలో నశిస్తాయి. అయినప్పటికీ, పౌరహక్కులకు గ్యారంటీ యిచ్చే పార్లమెంటరీ ప్రజాస్వామిక రాజ్యాంగాన్ని, స్వతంత్ర న్యాయ వ్యవస్థను, నిరంతర ఆర్థికాభివృద్ధి కోసం ప్రజాస్వామిక రాజ్యాంగాన్ని, స్వతంత్ర న్యాయవ్యవస్థను, నిరంతర ఆర్థికాభివృద్ధి కోసం ప్రణాళికా సంఘాన్ని, సాంఘిక న్యాయాన్ని, శాస్త్ర సాంకేతిక పునాదిని, అలీన దేశాల నేతగా అంతర్జాతీయ పాత్రను భారతదేశానికి కల్పించిన ఘనత నెహ్రూదే. కాని రాజకీయార్థిక పునాది అప్పటికే బీటలు వేసే స్థితికి వచ్చింది. ఆ విధంగా పాత్ర ఉండిపోయింది కానీ, అందలి పదార్థం అదృశ్యమైంది.

ఈ పరిశీలనలను బలపరిచేందుకోసం మొదటి మూడు పుస్తకాలను సర్వే చేదాం. చక్కగా వ్రాయబడి, అచ్చొంత్తించ బడ్డ అరుణ్ భట్టాచార్జీ పుస్తకం పిల్లలకు సరిపోయే ఉపోద్ఘాతం. నెహ్రూను నాయకునిగా నిరూపించే ప్రయత్నంలో ఆయనను అతిగా స్తుతిస్తుంది. ఉదాహరణకు, భట్టాచార్జీ ప్రకారం, ''మహాత్మాగాంధీ దేశాన్ని విముక్తి చేసినవాడైతే, నెహ్రూ అన్ని విషయాలలోను నవభారత నిర్మాత. ప్రజాస్వామ్యం, సోషలిజం, లౌకికవాదం, అలీన విధానం - ఇవి అధునిక భారతదేశాన్ని లేదా నెహ్రూ భారతాన్ని దృఢతరం చేసే అంశాలు.''

థామస్ పాంథమ్ ప్రకారం, నెహ్రూ జాతీయతావాదం సత్వర పాశ్చాత్యాధునికతా మార్పుతో లంకె వేయబడిందని చెప్పడంలో ఏ వివాదమూ లేదు. అది, ''స్వేచ్ఛావాదం, మార్క్సిజం, గాంధీవాదాల కలగలుపు కావడం వల్ల సత్వర మార్పును కలుగజేయగలిగింది.'' అనియంత్రిక అంతర్జాతీయ సమాజాన్ని విశ్వజనీనం చేయడానికి నెహ్రూ సహాయ పడ్డాడని ఒ.పి. రానా అభిప్రాయం. రమేష్ బాబు ప్రకారం, ''అలీన విధానం ప్రపంచంలోని అణచబడ్డ జనోద్ధరణలో వైఫల్యం చెందడం వల్ల సంకుచిత జాతి-దేశ దృక్పథంగా భావించ బడిందని అంటాడు. సమానావకాశాలను కల్పించడంలోను, దారిద్ర్యతా నిర్మూలనలో నెహ్రూ భావాలను ఎ.కె.ఆర్.వి. రావ్. అభివర్ణించాడు. ఎస్.ఆర్. బొమ్మయ్, ''తన తదనంతరం ప్రజాస్వామ్య, న్యాయవ్యవస్థల పునాదులను నాశనం చేయగల 'నియంతృత్వ ప్రజాస్వామ్యాన్ని' నెహ్రూ స్థాపించాడంటాడు.

మూడో పుస్తకం అమెరికాలో జరిగిన రెండు సెమినార్ల ఫలితంగా వెలువడింది. మైకేల్ బ్రెచర్, ''అసమగ్రమైన భూ సంస్కరణలు రాజకీయ నాయకునిగా నెహ్రూ బలహీనతను చాటుతా''యని చెబుతూ, ''నెహ్రూ చెప్పే మాటలకు చేసే చేతలకు మధ్య చాల అంతరం ఉం''దంటాడు. అంతేకాక, ఏళ్ల తరబడి భారత జన జీవనాన్ని గురించి పట్టించుకోక పోవడం వల్ల వారి జీవన ప్రమాణం అలాగే ఉండి పోయింది. నెహ్రూ తరచు బంధుప్రీతి గురించి, లంచగొండితనం గురించి ముచ్చటించే వాడే కాని వాటికి వ్యతిరేకంగా చాల అరుదుగా చర్య తీసుకొనేవాడు. క్లుప్తంగా చెప్పాలంటే, నెహ్రూ సాంఘిక సంస్కర్తే కాని విప్లవకారుడు కాదు. అయినా కానీ, రాజకీయ సుస్థిరత, ప్రజాస్వామ్యం, ప్రణాళికలు, లౌకిక రాజ్య స్థాపన, సాంఘిక మార్పులను సంబంధించిన పరపతి నెహ్రూదేనంటాడు, మైకేల్. నెహ్రూ మార్క్సిజంను (Pink Marxism) ఆనందమోహన్, ''నెహ్రూ గతకాలపు మార్క్సిస్ట్ రోగనిర్ధాయక పద్ధతిని ఒప్పుకొన్నాడు కానీ భవిష్యత్తుకోసం మార్క్సిస్టు తరహా మందు చీటీని తిరస్కరించాడు. నెహ్రూ సైనికీకరణను వ్యతిరేకించే మార్క్సిస్టు, పౌరస్వేచ్ఛను కోరే సామ్యవాది. అహింసను ఒప్పుకొనే తీవ్రవాది'' అంటూ విమర్శిస్తాడు.

నెహ్రూ యొక్క ''పైనుంచి క్రిందికి వచ్చే అభివృద్ధిని'' నిందిస్తూ భాకూ పరేఖ్, ''నెహ్రూ కాంగ్రెస్‌ను పట్టించుకోకుండా క్యాబినెట్‌ను పదావనం చేసినందుకు, పార్లమెంటుకు దాని అవధులు దానికి ఉన్న కారణంగా, రాజ్యంపైన ఉద్యోగిస్వామ్యం తన అధికారాన్ని పరచి దానికి సంరక్షణ భారం వహించినందువల్ల రాజ్యం సమాజం నుంచి విడిపోయింది. వలసరాజ్య ఆలోచనా విధానపు ఆధిక్యత అభివృద్ధి కార్యక్రమాలలో ప్రజా ప్రమేయం లేకుండా చేసింది. లంచగొండితనం పెరిగి పోతూ వచ్చింది. నెహ్రూకు ఈ విధమైన ఉద్యోగి స్వామ్యాన్ని సంస్కరించాలని తెలిసినా అందు కోసం చేసింది తక్కువ,'' అంటాడు. ''నరకానికి నడిపించినా అధికారాన్ని ప్రజలకు ఈయవలసిందే'' నంటూ 1956లో పంచాయతీరాజ్‌ను

సమర్థించాడు నెహ్రూ. ''ఆర్థికాభివృద్ధిలో జైగాంటిసిజం జబ్బును'' ఖండించడం మొదలె ట్టాడు. చిన్న చిన్న విద్యుత్కేంద్రాలు, చిన్న తరహా నీటిపారుదల ప్రాజెక్టులు మంచివని యెంచాడు. గాంధీ చెప్పింది కూడ యించుమించు యిదే.

నెహ్రూ లౌకికతత్వం గురించి అస్గర్ అలీ, ''నెహ్రూ గాంధీ మతాన్ని ఏ యితర మతంకంటె కూడ బహుశా నైతికమైనదిగా అర్థం చేసుకున్నాడు.'' కాని అతని లౌకికతత్వం పాశ్చాత్యమైంది. ''కొంతమటుకు ముస్లింల పట్ల నెహ్రూ విధానం (వారు వెనుకబడిన వారనీ, ఇండియన్ యూనియన్లో ఉండే విధంగా వారి భయాలను తొలగించాలను కోవడం వల్ల కూడ) కొంత మెతకనైనది. ''దేశ విభజనకు యితరులు కూడ కారణమైనా, ముస్లింలీగ్, దానిభావాలు, జిన్నా బాగా కారణమైనట్లు ప్రచారం చేయబడింది. శాస్త్ర సాంకేతిక వ్యసనం, ఆర్థికాభివృద్ధి భారతసమాజాన్ని లౌకీకరించ గలవని నెహ్రూ ఎంచాడు.

గిరి దేశింగ్ కర్ చెప్పినట్లుగా, నెహ్రూ అభిప్రాయం ప్రకారం చైనా ఎప్పుడూ, కలహప్రియ మైనదే. మనకు ఆ దేశానికి మధ్య యుద్ధం పూర్తి కాలేదు. చాల కాలం జరుగుతుంది. అతి పెద్ద జనాభాతో కూడిన చైనా ఆర్థికశక్తి నెహ్రూ దృష్టిలో ఒక బాంబు మిశ్రయం (explosive mix). ''రెండు దశాబ్దాలలో చైనా మొత్తం ప్రపంచానికే అపాయం కాగల'' దని 1960లో నెహ్రూ జోస్యం చెప్పాడు. దాని తర్వాత రెండు సంవత్సరాలకే చైనాతో మనకు యుద్ధం సంభవిం చింది.

★ ★ ★

న్యూయార్క్ టైమ్స్ రిపోర్టరైన ప్రణయగుప్తా భారతదేశం గురించి తన మూడవ పుస్తకంలో వ్రాసిన విషయాలకు నామౌచిత్యం లేకుండా పేరుపెట్టాడు (Mother India: A Political Biography of Indira Gandhi). ఇది కేవలం ఇందిరాగాంధీ రాజకీయ జీవిత చిత్రణే కాదు; రెండు దశాబ్దాలపైగా సాగిన జననీ తనయుల రాజకీయ జీవిత చిత్రణ, ఇందిరాగాంధీని గుప్తా 'భారత మాత'గా గుర్తించడు కాని, భారతదేశ ప్రజ ఆమెను 'భారతమాత'గా భావించిందంటాడు.

ముందుగా అతడు వ్రాసిన రెండు పుస్తకాలలో ఒకటి 'Revenge: After the Assassination of Indira Gandhi' - ''1984 సంవత్సరం అక్టోబరు 31వ తేదీ ఉదయం తన స్వంత సెక్యూరిటీ గార్డుల్లోని యిద్దరు శిఖ్ఖుల తుపాకీల నుండి నిముషంలోపు కాలవ్యవధిలో 32 గుళ్లు సుకుమారమైన ఆమె శరీరంలోనికి దూసుకు పోయిన తర్వాత, ఢిల్లీ నగర శిఖ్ఖులకు ఏమొచ్చిందో చక్కగా భావచిత్రం మాదిరి భావావేశంతో వర్ణించింది. స్వర్ణ దేవాలయాన్ని భారత సైనికదళం కూల్చిన తరువాత ఆ సంవత్సరం మే నెలలో న్యూయార్క్ టైమ్స్ పత్రిక తరపున గుప్తా పంజాబులో పర్యటించాడు. ఆ రిపోర్టు చాలవరకు 1985లో అతడు వ్రాసిన పుస్తకంలో చేరింది. అతడు వ్రాసిన రెండవ పుస్తకం, India: Challenge of Change'' - ఆదిలో యిచ్చిన వాగ్దానాలు, చివరికి మిగిల్చిన నిరాశలతో కూడినటువంటి రాజీవ్ గాంధీ అయిదేళ్ల పాలనను స్పష్టంగా, అందలి వెలుగు నీడల్ని నిశితంగా పరిశీలిస్తూ 1989లో వెలువడింది.

అతని ఆఖరి పుస్తకం, ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్యమైన భారతదేశ ప్రధాన మంత్రులుగా తల్లీ తనయుల కథను ఒక క్రమంలేని పద్ధతిలో వర్ణిస్తుంది. నెహ్రూ-గాంధీ

కుటుంబం భారతదేశ ప్రజాస్వామ్య భవితవ్యాన్ని ఒక విధంగా రూపొందించింది; మరొక విధంగా రూపొందించలేదు. భారతదేశపు నేటి పరిస్థితికి సంబంధించిన నిందా ప్రశంసలు చాలవరకు నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీలకే దక్కుతాయి. కొద్దికాలం పాటు 1977-79, 1989-90లలో ఇతర పార్టీలు, పార్టీ సంయోగాలు, వ్యక్తులు పాలించినా వారి పాత్ర రాజకీయ వ్యవస్థా విధానపు పొలిమేరల్లోనే సాగింది.

అకాలీ సంకీర్ణం ఇందిరాగాంధీకి వ్యతిరేకంగా మారి పంజాబుకు రాయితీలు అడిగినప్పుడు దేనికైతే ఉత్తరాది హిందువుల అభిమానాన్ని కోల్పోకుండా తాను చేయలేదో, 1980 తర్వాత తిరిగి ఆమె అధికారానికి వచ్చిన తర్వాత దేనినైతే తాను చేయరాదని భావించిందో దానిని చేయడం కోసం) సంజయ్‌గాంధీ, అప్పటి దేశ వ్యవహారాల మంత్రి జ్ఞానీ జైల్‌సింగ్‌లు - సంత్ జర్నైల్‌సింగ్ భింద్రన్‌వాలేను ఎడతెగని ఢిల్లీ ప్రభుత్వ సహకారంతో అకాలీదళ్ వెన్నెముక విరగగొట్టగల వ్యక్తిగా గుర్తించి దువ్వారు. గుప్తా ప్రకారం, ''భింద్రన్‌వాలేలో సంజయ్‌గాంధీని ఆకర్షించినది అతని కళ్లలోనున్న ఒకానొక విధమైన మెరుపు. సంజయ్‌గాంధీ నిర్దేశాలు హింసకు కారణమౌతాయని తెలిసీ అతని కోరికను భింద్రన్ మన్నించడం,'' (P 316). నిజానికి ఇందిరాగాంధీ, రాజీవ్‌ల కాలంలో పంజాబ్, కాశ్మీర్లలో పెల్లుబికిన విషాదాన్ని సవివరాత్మకంగా గుప్తా వర్ణించిన వైఖరి బహుశా అతని సమకాలీన భారత రాజకీయ చరిత్ర చిత్రణలో అత్యుత్తమ పుటలు.

''శిఖ్ఖు విషాదపు సంవత్సరాలను పర్యాలోకిస్తే, ఇందిరాగాంధీ హత్యానంతరం ఢిల్లీలో చెలరేగిన శిఖ్ఖు హింసాకాండ, ఇందిరాజీ హత్యకు ప్రతిగా జరిగిన హిందూ గర్వోన్నత్మ ఆగ్రహమని అనిపించదు. ఢిల్లీలోను, దేశంలోని యితర ప్రాంతాలలోను శిఖ్ఖులపై జరిగిన అత్యాచారాలకు ఇతర కారణాలే అధికం. ముఖ్యంగా, వ్యక్తిగత కక్షలు తీర్చుకోవడం, సాధారణ లూటీ మానభంగాల నిమిత్తమే, ఖలిస్థాన్ విషయంలో ఢిల్లీ వాసుల కోపాగ్ని పాత్ర ఉండనే ఉంది.'' పంజాబు సమస్యను విశ్లేషించిన యితరులవలె, గుప్తా కూడ ఇందిరాగాంధీ మితవాద శిఖ్ఖు నాయకులతో చర్చించి ఆ సమస్యను పరిష్కరించకపోగా, దానిని ఆధారంగా చేసుకుని హిందూ అభిమానాన్ని ఆకట్టుకొనే యత్నం చేసిందని నమ్ముతున్నాడు.

జమ్ము కాశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్ క్షీణించడంలో ఇందిరా రాజీవ్‌గాంధీల పాత్రపై బుజువులతో సహా చేసిన విశ్లేషణ కాశ్మీరీ ముస్లింలు ప్రస్తుతరీతిలో భారత దేశానికి పరాయిగా మారిపోవడం తాలూకు విత్తనాలు క్రమేపీ, నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీల ద్వారా ఎలా విత్తబడినాయో సోదాహరణంగా వివరిస్తుంది. ఇండియన్ యూనియన్‌తో ఇందిరా గాంధీ తనయునిగానో మనకు బాగా తెలుసు. సోనియా చిత్రించిన రాజీవ్‌గాంధీ మన హృదయ తంత్రులను మీటుతాడు.

సోనియా ప్రకారం వారి కుటుంబాలు ఎక్కువ వ్యత్యాసాలు కలవి కావు. ఆమెది ఇటలీ కుటుంబము. అతనిది భారతీయ కుటుంబమూ అనికాదు. ఆమెది ఇటలీలోని మిలాన్ నగర శివార్లలో జీవించే మధ్యతరగతి వ్యాపారస్థ కుటుంబం. అతను భారతదేశంలోని గొప్ప ప్రసిద్ధి చెందిన కుటుంబానికి చెందినవాడు. జవహర్‌లాల్ మనమడు, అప్పట్లో కాబినెట్ మంత్రి అయిన ఇందిరాగాంధీ తనయుడు. అయినప్పటికీ సోనియా త్వరలోనే ఆమె భర్త అత్తగార్ల ప్రేమకు పాత్రురాలైంది. హిందూ కుటుంబానికి చెందిన ఎన్నో కర్మకాండలను ఒప్పుకొంటూ, క్రమేపీ ఆమె తనను తాను భారతదేశంతో మమేకం చేసుకొంది. ఆమె

తన క్రొత్తజీవితంలోనిక ఒకే మారుగా నెట్టవేయ బడలేదు. ఆమె మాటల్లోనే, ''నాయంతటనేనుగా ఉంటూ రాజీవ్ ప్రపంచంలోనికి ఇమిడిపోయేలా... నాకుగా నేనొక విధానాన్ని కనుగొనే విధంగా'' ఉంచబడింది.

''కుటుంబంలో కేంద్ర స్థానంలో ఉన్న'' ఇందిరాగాంధీని - ఆమె పదోన్నతిని బట్టికాక, ప్రేమించే ఆమె స్వభావరీత్యా - ఈ రచన బాగా వర్ణించింది. సోనియా వర్ణించిన ఇందిరాగాంధీ ప్రధాని కాదు; తనకోసం (సోనియాకోసం) ఎంతో జాగ్రత్త తీసుకునే అత్తగారు. ఎంతో వివాదాస్పదమైన రాజకీయ జీవితాన్ని చవిచూసిన వ్యక్తికాదు; ఆమెకు రెండో తల్లి (రాజీవ్ యింట్లేని సమయాల్లో ఆమె అర్ధరాత్రి సమయంలో తన గదిలోనికి రావడం, ఆస్థమాకు తాను మందు తీసుకోవడానికి సహకరించడం వంటి విషయాలను సోనియా ఉదాహరిస్తుంది). అయితే యితర రచయితలెందరో వర్ణించిన కుటుంబంలోని ఉద్రిక్తతలను, చీలికలను సోనియా చాల జాగ్రత్తగా వదిలివేసింది.

సోనియా చిత్రించిన రాజీవ్‌గాంధీ పెంపుడు జంతువులకు అంకితమై జీవంతో, నవ్వుతోను సదాతొణికసలాడే యువకుడు. నెహ్రూ-గాంధీ కుటుంబపు అవిచ్ఛిన్న సాంప్రదాయంలో భాగంగా, రాజీవ్‌గాంధీ ప్రయాణంలో ఉన్నపుడు గానీ, లేదా పిల్లలే దూరంగా ఉన్నపుడు కానీ వారికి క్రమం తప్పకుండా ఉత్తరాలు రాస్తూండేవాడు. ఫలితమేమీ ఆశించకుండా తన పిల్లలకు వ్రాసేవాడు. (నెహ్రూ కూడ తన కుమార్తెకు జైలు నుంచి లేఖలు రాస్తూండేవాడు - రచయిత). సంగీత భరితమైన డ్రామాలను యిష్టపడే సోనియాతో అతను శాస్త్రీయ సంగీతం పట్ల తనకున్న యిష్టతను పంచుకోనేవాడు. తన చేతులతో తాను వస్తువులను చేయడాన్ని అతడు తన తండ్రి దగ్గర నేర్చుకొన్నాడు. రాజీవ్ వినోదంగా ఒక రేడియ స్టేషనును నడిపాడు. అంతేకాక అందం పట్ల సున్నిత భావం కలిగిన మంచి ఛాయా చిత్రకారుడు కూడ. రాజీవ్ బుల్‌బుల్ పిట్ట గూటిని పరిశీలించేవాడు, నాగుపాముకైనా హానిచేసేవాడు కాదు. రహదారి ఏక్సిడెంట్లో గాయపడిన వారెవరైనా వారికి సహాయం చేయకుండా ఎప్పుడూ అతడు అక్కడినుంచి కదిలిపోలేదు. కుటుంబంలోని వారు తప్పించి బయట ఎవ్వరూ అతనికి దగ్గరి స్నేహితులు వేరనే చెప్పాలి. ''ఆనందమైనా, విచారకరమైనా లేదా ఆత్రుత కలిగించేదైనా తన అనుభూతలను పంచుకొనే స్నేహితుడెవడూ అతనికి కుటుంబంలో తప్ప బయట లేరు.''

రాజీవ్ చుట్టు తన ప్రపంచాన్ని నిర్మించుకొన్న సోనియా, సంజయ్‌గాంధీ మరణానంతరం, రాజీవ్ రాజకీయ ప్రవేశాన్ని చాల బలవంతంగా వ్యతిరేకించింది. ''మేమిరువురం ఒకరినొకరం ఎరిగిన పదిహేనేళ్ల తర్వాత ప్రథమంగా మా యిద్దరి మధ్య ఒకానొక తీవ్రమైన అభిప్రాయ భేదం ఏర్పడింది. అతని గురించి, మా గురించి, మా పిల్లల గురించి, అన్నిటికంటె మేమెంతో అతి జాగ్రత్తగా పొందుపరచుకొనే అది సామాన్య మానవహక్కు అయిన మా స్వేచ్ఛ గురించి... సివంగిలా పోరాడా'' నంటుంది సోనియా.

తల్లి హత్యానంతరం రాజీవ్‌కు ప్రధానమంత్రి పదవి కట్టబెట్టే సమయంలో మరొకసారి ఆమె పోరాడింది. ''నేను రాజీవ్‌ను వద్దని అర్థించాను. అతనితోను, అతని చుట్టు ఉన్నవారితోను అతనూ తల్లిలా చంపబడతాడని ఏడ్చి మొత్తుకున్నాను, నా చేతులు పట్టుకొని నన్నూరడించే ప్రయత్నం చేస్తూ, 'వేరే గత్యంతరం లేదు', రాజీవ్ చెప్పాడు, 'నేను ఎలాగైనా చంపబడవచ్చు'.'' ఇందిరాగాంధీ సాంవత్సరీక సందర్భంలో, రాజీవ్, సోనియా వారివారి

మరణానంతరం వారి అంత్యక్రియలు ఎక్కడ ఎలా జరగాలో తెలియజేస్తూ ఒకే రకమైన కొన్ని సూచనలను విడిగా రాసి సంతకం చేసారు.

రాజీవ్ మరణానంతరం సోనియాను ఇందిరా కాంగ్రెస్ నాయకత్వాన్నీ, ప్రభుత్వ నాయకత్వాన్నీ తీసుకొమ్మని అడిగిన కోటరీ సభ్యులకు రాజీవ్ తన తల్లి స్థానాన్ని తీసుకొనే నేపథ్యంలో అతనితో సివంగిలా పోరాడిన విషయం తెలుసా? ఒక వేళ వారికి తెలుసుంటే, వారామెను క్రూరంగా, పాశవికంగా బ్లాక్‌మెయిల్ చేసినట్లే. ఎందుకంటే సోనియాగాంధీ ఎప్పుడూ తన భర్తను అనుసరించాలనీ, తనను తన యిద్దరి పిల్లలనూ హంతకుల బుల్లెట్లకు గురిచేయాలనీ అనుకోలేదు. ఆమె తన భర్తను సరిగా సేవించనివారిని తిరస్కరించడానికి గాను ఒక నెలకాలం తీసుకుంది. కాని ఆమె నిర్ణయాలు ఆమెను ఎంతోమంది భారతీయుల దృష్టిలో మిన్నగా చేసాయి. ఆమె, ఆమె భర్త, యిద్దరూ కూడ వారి పిల్లలు ప్రధానమంత్రి యింట్లో బంధిత జీవితం గడపవలసి రావడం పట్ల సంవత్సరంపాటు కుమిలిపోయారు. సోనియాగాంధీ, రాహుల్, ప్రియాంక ముగ్గురూ ప్రధానిపదవిని చేపట్టేకంటే బ్రతుకును ఆస్వాదించడం మిన్నగా భావిస్తారు. రాజీవ్ మరణంతో నెహ్రూ-గాంధీ సంస్థానం అంతరించింది. చారిత్రక విస్మృతికి గురికాని పక్షంలో, సోనియాగాంధీ, ఆమె యిరువురి పిల్లలు భారతీయుల హృదయాలలో ఎప్పుడూ నిలచే ఉంటారు.

ఈ వ్యాసంలో సమీక్షించిన పుస్తకాలు:

1. *The Maker of Modern India* by Arun Bhattacharjee (Himalayas Pub. House).

2. *The Nehru Legacy,* edited by Amal Ray, N. Bhaskara Rao, Vinod Vyasulu (Oxford & IBH).

3. *The Legacy of Nehru,* edited by D.R.Sardesai and Anand Mohan (Promilla & Co).

4. *Mother India: A Political Biography of Indira Gandhi* by Pranay Gupte (Charles Scribners Sons).

5. *Rajiv by Sonia Gandhi* (Penguin).

# బాబాల గారడీ

## అరచేతినిగిల్లి నీరుతెప్పించుట

క్రొత్త వెదురుబొంగు నొకదానిని తెచ్చి దానిలోపలనుండు సుల్లిపొరనుతీసి జాగ్రత్తపరచుకొనుము. నీవు గారడీచేయుటకు ముందుగా నీయరచేతిలో కొంచెము నీరుపోసికొని లోగడ జాగ్రత్తపరచుకొనిన వెదురుపొరను అరచేతికి సరిపడునట్లంటించుకొని చూచువారలకు ముందు నీచేతిని చూపి రెండవచేతితో అపొరనుగిల్లిన నీరు పయికి చిమ్మిపడి చూచువారలకు వింతగొలుపును.

# ధోరణి – VI

– డా॥ సంజీవ దేవ్

కూర్చోండి కూర్చోండి, నన్ను చూచి లేస్తారెందుకు? నేను మీకంటే చిన్న వాడిని.

అవును, నాకంటే చిన్న వారు మీరు. ఎత్తులో చిన్న, లావులో చిన్న, వయసులో చిన్న. ఈ సత్యాన్ని నేను కాదనను. కాని నాకంటే తెలివిలో పెద్ద, చదువులో పెద్ద, ఆలోచనలో పెద్ద, ఇంకా ఇటువంటి ఎన్నిటిలోనో పెద్ద, అటువంటప్పుడు మిమ్మ్మ చూచి లేవటంలో అమర్యాద ఏముంది?

భలే వారండి, మాటల గారడీతో నన్ను, మీకంటే చిన్న వాడినైన నన్ను, మీకంటే పెద్ద వాడినిగా రూపొందించారు. మీరు నిజాయితీతోనే నన్ను ఆ విధంగా రూపకల్పన చేసినందుకు సంతోషిస్తానే కాని విచారించను.

నేను మిమ్మ్మ గురించి అన్నవి మంచి మాటలే కనుక మీరు సంతోషించినా నేను బాధపడను, విచారించినా నేను సంతోషించను. ఒకోసారి ఇతర్ల విచారం మనకు సంతోషాన్ని కలిగిస్తుంది. ఇతర్ల సంతోషం మనకు విచారాన్ని కలిగిస్తుంది.

మీరన్నది నేను అంగీకరిస్తాను. ఇటువంటి వాటినే కాబోలు మేము సైకాలజీ చదువుకొనే రోజుల్లో మా ప్రొఫెసర్ అంటుండే వారు శాడిజం అనీ, మెసోకిజం అనీ.

మళ్లీ మనం శాస్త్ర చర్చల్లోకి జారిపోతున్నాం. ఇటువంటి హాయి అయిన వాతావరణలో మనం శాస్త్ర చర్చలులాంటి అసామాన్య విషయాలను దూరంగా ఉంచి దైనందిన మైన సామాన్య విషయాల ధోరణిలో ఆనందం పొందుదాము.

సరే, మీ సూచన బాగానే ఉన్నది కాని మీరు ఉచ్చరించిన ఒక పదాన్ని గురించి ఒక చిన్న సందేహం ఏర్పడింది. మీరు 'వాతావరణ' అని ఉచ్చరించారు. అది సరైన ప్రయోగ మేనా? వాతావరణం లేక వాతావరణము అనాలి కాని వాతావరణ అంటే సరిపోతుందా?

ఎందుకు సరిపోదు? నిజానికి ఏదీ కూడ దానంత అది సరిపోదు, మనం సరిపుచ్చితేనే సరిపోతుంది. ఉత్తరాదివారు హలంతాలను వాడతారు కనుక వారు 'వాతావరణ్' అంటారు, మనం వాతావరణం అంటాం వ్యావహారిక భాషలో, గ్రాంధిక భాషలో అయితే వాతావరణము అంటాం'. ఇక కన్నడులు 'వాతావరణ' అంటారు. ఉత్తరాది వారు నాగపూర్ అంటే మనం నాగపురం అంటాం, కన్నడులు నాగపుర అంటారు. మిగతా రెండు విధానాల కంటే కన్నడుల విధానం బాగుంటుంది నాకు. అందుకే నేను తెలుగులో 'వాతావరణ' అంటు న్నాను. మనం అలవాటు చేసుకోటంలో ఉంటుంది. ఏదైనా, ఏది వాడుకలోకి వస్తే, అదే సూత్రం అవుతుంది, తప్పుకాకుండా పోతుంది.

మీ దృక్పథాన్ని అందరూ అంగీకరించక పోవచ్చు. కాని అది వినటానికి ఇంపుగా ఉంటుంది. ఇంపుగాను, సొంపుగాను ఉండేవన్నీ శాస్త్రీయంగా ఉంటాయా అనేది కూడ సందేహమే. ముందుగా శాస్త్రం పుట్టి తరువాత ఇంపు సొంపు పుట్ట లేదు, ముందుగా

ఇంపు సొంపులు పుట్టి అవి బాగున్నట్లు వినిపించటంతో కనిపించటంతో అవి శాస్త్రబద్ధం అయినాయి. శాస్త్రంలో లేని అనేక నూతనాలను మనం సృష్టించు కొంటుంటాం. తరువాత అవే శాస్త్రాలు అవుతాయి.

ఇప్పుడే అనుకున్నాం శాస్త్ర చర్చ వద్దు అని, కాని తిరిగి ఆ వద్దు అనుకున్న దాన్నే చేస్తున్నాం. మానవుని బలహీనతల్లో వద్దు అనుకున్న దాన్ని చేయటం ఒకటి! మనిషిలో బలీయతల కంటే బలహీనతలే ఎక్కువ బలం కలిగి ఉంటాయి. కనుకనే మనిషి బలీయతల కంటే బలహీనతలకే ఎక్కువ తేలికగా లోబడతాడు. మరో విశేషమేమంటే తనలోని బలీయతలను గుర్తించినట్లుగా తనలోని బలహీనతలను గుర్తించలేడు. ఒక్కోసారి తనలోని బలహీనతను బలీయత అని భ్రమ చెందటం కూడ జరుగుతుంది. ఈ విధానం ప్రమాదకరం. ఒకదాన్ని మరొకటిగా భ్రమచెందటం చాలా విపత్కర విషయం.

పోనివ్వండి ఆ విపత్కర విషయాలను, ఇప్పుడున్న విపత్తులతోనే ప్రాణ సంకటంగా ఉన్నది, వీటికి తోడు మరికొన్ని విపత్తులను కొనితెచ్చుకోటమెందుకు?

సరే, ఇంతకూ మీరిప్పుడు ఏమి చేస్తున్నారు?

మీరు చూస్తూనే ఆ ప్రశ్న అడుగుతారెందుకు? నేనిపుడు 'ఏమి చేస్తున్నానంటే మీరేమి చేస్తున్నారని మీరడిగే ప్రశ్నను వింటున్నాను.

మాటల్ని మధ్యపెట్టి సత్యాల్ని మరుగుపరచే ప్రయత్నం చేయకండి. మీరు ఇపుడు ఏమి చేస్తున్నారనటంలో ఇపుడు అనే మాటను ఈ క్షణంలో అనే అర్థంలో వాడలేదు, కొంతకాలంగా ఏమి చేస్తున్నారు అనే అర్థంలో వాడేను. మొన్నటి యుద్ధంలో చాలామంది హతం అయిపోయారు. అంటే అర్థం నిన్నకాక మొన్న జరిగిన యుద్ధం అనికాక కొన్నాళ్ల క్రితం జరిగిన యుద్ధం అని అర్థం. అదే భావం నేను వాడిన 'ఇపుడు' అన్న మాటకు కూడ వర్తిస్తుంది.

ఓహో అదా మీరనేది, ఆ మాటను మీరు భావార్థంలో తీసుకున్నారు, నేను దాన్ని పదార్థంలో వాడేను. భావార్థాలు సాహితీ జగత్తుకు ఎక్కువగా ఉపయోగపడితే పదార్థాలు వ్యావహారిక జగత్తుకు. వ్యావహారిక జగత్తులో భావార్థాలు ప్రమాదాలను సృష్టించే అవకాశం ఉంటుంది.

ఇంతకూ మీరు నన్ను చూడాలనే వచ్చారా లేక ఎటైనా పోతూ ఇటు వచ్చారా? ఆ రెంటికీ పెద్ద భేదం ఏమీ లేదు. ఆ రెండు విధాల్లో రావటంలో కూడా నేను మీకు కనిపిస్తాను.

మీరు నాకు కనిపించటమే కాదు, మిమ్మును నేను చూస్తున్నప్పుడు నేను కళ్ళు తెరచి ఉండటం మీరు కళ్ళు మూసుక ఉండటం జరగదు. కనుక నేను మిమ్ము చూడటం అంటే మీరు నన్ను చూడటం కూడ. మిమ్ము నాకు చూపటం అంటే నన్ను మీకు చూపటం కూడా అని. నేను ఎటో పోతూ మిమ్ము చూడటానికి కాని, మిమ్ము చూచి ఎటో పోవటానికి కాని రాలేదు. ఎటూ పోకుండా మిమ్ము చూడటానికీ, మిమ్ము చూచి ఎటూ పోకుండా మీతో మాటాడటానికి మాత్రమే వచ్చాను.

మిమ్ము ఒక సామాన్య ప్రశ్న అడుగుతాను. నన్ను మీరు చూడటంలో మీకు ఎక్కువ ఆనందమా లేక నేను మిమ్ము చూడటంలో ఎక్కువ ఆనందమా?

సామాన్యార్థంలో మిమ్మ నేనూ నన్ను మీరూ చూడటంలో సమానాందం ఉంటుంది. మిమ్మ మాత్రమే నేను చూడటంలో విశేషానందం ఉంటుంది. ఇక మనం ఉభయులం కూడ ఒకరినొకరు చూడక పోవటంలో ఆనందం ఉండక పోవటమే కాక విషాదం కూడ ఉంటుంది. అటువంటి విషాద తిమిరాన్ని రానీయకుండా చూచుకోటానికే నేటి ఈ నారాక.

ఏమిటో ఎవరిని ఏ వేళలో కదలించినా కూడ విషాదం విషాదం అనే మాటలు ఎంతో విషాదంగా వినిపిస్తుంటాయి. మరి ఈ విషాదం అనే దానికి ఆది ఎక్కడో, మధ్య ఎక్కడో, అంతం ఎక్కడో తెలియటం లేదు. అసలు విషాదం కంటే విషాదం మీది భయం మనుషుల్ని ఎక్కువ విషాదపరుస్తున్నది. అసలు తర్కించి చూస్తే భయం అనేది అన్నిటికంటే గొప్పగా విషాదకరమైంది. భయాన్ని గురించిన విషాదం ఉన్నట్లే విషాదాన్ని గురించిన భయం కూడ ఉంటుంది.

అవును, మీరు చెప్పింది వాస్తవమే. బజారున పోయే మనిషి మొదలు బంగారు కార్లలో తిరిగే ప్రతి మనిషి వరకు నిరంతరం ఏదో ఒక ఆందోళనలో, ఏదో ఒక భయంలో నివసిస్తున్నట్లు నిరానందంగా గోచరిస్తుంటాడు. ఇటీవల మరో మనస్తత్వం కూడ ప్రత్యక్షం కాజొచ్చింది యువతరంలో. సుఖంగా ఉన్నట్లు కనిపించటం కంటే ఏదో ఆందోళనలో ఉన్నట్లు కనిపించుట ఒక ఆధునిక ఫాషన్ అని, దాంతో చాలామంది యువజనులు తమలో నిజంగా ఆందోళన లేకపోయినా ఏదో ఒక ఆందోళన ఉన్నట్లు నటించ సాగుతున్నారు అపుడపుడు. ఇటువంటి మనస్తత్వం విస్తరించడం ఘోర ప్రమాదం అవుతుంది.

మీరన్న మాటల్లో ప్రమాదం అనేది వచ్చింది. మీరు పైన చెప్పిన నేటి మనస్తత్వం ప్రమాదం అనే దానికి గౌరవం ఉన్నది. అటు వంటి మనస్తత్వం ఉన్న వారికి ప్రమోదం కంటే ప్రమాదం ఎక్కువ ఇష్టం. విషాదానికీ ప్రమాదానికీ దగ్గర సంబంధం. అందువల్ల విషాద మనస్తత్వాన్ని ప్రేమించే వాళ్లు ప్రమాద మనస్తత్వాన్ని కూడ ప్రేమిస్తారు. ఇటువంటి తల్లక్రిందుల మనస్తత్వాన్నే పర్వర్టెడ్ సైకాలజీ అంటారు.

సమాజంలో ఇటువంటి పర్వర్టెడ్ సైకాలజీ పెరగటానికి ప్రధాన కారణం ఏమై ఉంటుందంటారు?

ముందుగా మీరు వేసిన ప్రశ్నయే తప్పుది. మీరు అడగాలసింది కారణం ఏమై ఉంటుందని కాదు, కారణాలు ఏమై ఉంటాయని అడగాలి. దీనికి ఒక కారణం అంటూ ఉంటే సరిపోదు, కొన్ని కారణాలు అంటూ ఉంటాయి.

నాకు తెలిసినంతవరకు ఆ కారణాలు శరీరానికి సంబంధించినవని, మనసుకు సంబంధించి నవని, వాతవరణ వైపరీత్యాలకు సంబంధించినవని, సమాజానికి సంబంధించినవనీ అనవచ్చు నేమో అనిపిస్తుంది. మీ వివరణ సక్రమంగా ఉన్నది. అంటే అన్ని విధాల కారణాలుంటేనే కాని నేటి పర్వర్టెడ్ సైకాలజీ రూపొందటానికి అవకాశం ఉండదు. వాటిలో ఏ ఒకటో రెండో కారణాలు సరిపోవు.

అందుకు నేను అంగీకరిస్తాను. నాకు తట్టిన మరో విశేషమేమంటే, మరీ పూర్వపు రోజుల్లో ధనికులు సుఖంగా ఉండే వారని, బీదలు బాధల్లో ఉండే వారని అనుకునే వారు. తరువాతి తరువాతి చాలా కాలానికి అనుకోసాగేరు, బీదలకంటే ధనికులే ఎక్కువగా బాధల్లో ఉంటా రని, ధనికులకంటే బీదలే కొంత సుఖంగా ఉంటున్నారని. కాని కాలక్రమేణ ఈ సత్యం

కూడ తల్లక్రిందు లైనట్లు తెలుస్తుంది.

పైన అన్న మీ ఆఖరి వాక్యం నాకు సరీగా అవగాహన కావటం లేదు. దాన్ని కొంచెం విశదీకరించి చెప్పండి.

చెపుతాను. తాత్పర్యం ఏమంటే ఒకప్పుడు ధనికులు మాత్రమే ఎక్కువ సుఖపడే వారని, తరువాతి కాలంలో ధనికుల కంటే బీదలే ఎక్కువ సుఖపడే వారనీ, నేడు ధనికులూ సుఖపడటం లేదు, దరిద్రులూ సుఖపడటం లేదనీ. విచిత్రం ఏమంటే ఉన్న వారిలోను లేని వారిలోను కూడ విచారం కొద్ది భేదాలతో నివసిస్తుందనీ, అంటే ధనికులూ దరిద్రులూ కూడ నిజంగా సుఖపడటం లేదని, వీరి ఉభయుల జీవితాలు కూడ నేడు అశాంతిలో నివసిస్తున్నాయని.

నిజమే నండీ మీరు చెప్పిన సత్యం నాకూ సమాజంలో స్పష్టంగా గోచరిస్తూంది, అటు ధనికుల జీవితాలు, ఇటు బీదల జీవితాలు కూడ సుఖశాంతులకు దూరంగా ఉంటున్నట్లు గోచరిస్తున్నాయి. వారి ఉభయుల జీవితాల్లో కూడ ఒక అసంతృప్తి, ఒక ఆ వేగం, ఏదో అందని దాన్ని అందుకోవాలనే నిరంతర తపన రాజ్యం చేస్తున్నాయి.

బాగుంది, దీన్నిబట్టి తేలేదేమంటే ధనికత్వం మాత్రమే సుఖానికి కారణం కాదని, బీదతనం మాత్రమే బాధలకు కారణం కాదని, ధనం ఉన్నా కూడ బాధ తప్పటం లేదు, ధనం లేకున్నా కూడ బాధ తప్పటం లేదు. ధనానికి విలువలేదని కాదు, ధనానికి మాత్రమే విలువ లేదని, ధనానికి కూడా విలువ ఉన్నదని. ఏది ఏమైనా నేటి మానవుడు అనుభవిస్తున్న మానసిక అశాంతికి కారణం ధనం మాత్రమే కాని, ధనాభావం మాత్రమే కాని కాదు.

అంటే ఆధునిక అందోళిత జీవితాలకు కారణం భౌతిక కారణాలు కాక నైతిక కారణాలనా మీ అభిప్రాయం? ఈ భేదాన్ని కూడ వెడల్పు చేసి చూపటానికి అంతగా వీలు కనిపించదు. కారణం మనం అనే నైతికాలు కూడ భౌతికాల కంటే అధిక భిన్నమైనవి కావు, నైతికం కూడ కొద్ది గొప్ప మార్పులతో భౌతికమైనదే. భౌతిక పతనం జరుగుతూంటే నైతిక పతనం జరగకుండా ఉండలేదు, నైతిక పతనం జరుగుతుంటే జీవన పతనమూ జరుగుతుంటుంది. జీవన పతనం జరుగుతుంటే వ్యక్తిలో కాని, సమాజంలో కాని అశాంతి తప్ప శాంతి, దుఃఖం తప్ప సుఖం ఎట్లా మన గలవు?

అంటే, మీరనేది భౌతికం అనేది కారణమూ, అ భౌతికమనేది కార్యమూ అని. ప్రతి కార్యానికీ ఒక కారణముంటున్నపుడు మరి భౌతికానికి కారణమేమిటి? ఒక దశలో కార్యం అనబడేదంతా కూడ మరొక దశలో కారణమే. అటువంటప్పుడు అభౌతికానికి భౌతికం అనేది కారణమై ఉన్నపుడు ఆ కారణం కూడ ఒకదానికి కార్యమై ఉండాలి. అది కార్యమైన పుడు దానికి కారణం ఉండి ఉండాలి. అభౌతికం అనే కార్యానికి భౌతికం అనేది కారణమన్న పుడు ప్రతి కారణం కూడ కార్యమే కనుక భౌతికం అనే కార్యానికి కారణం ఏమై ఉంటుంది?

మీ తర్కంతో భలే తీర్చలేని చిక్కు తెచ్చి పెట్టేరు, భౌతికం అనేది కారణంగానే మిగిలిపోతే దాన్ని కార్యంగా కూడ చేసి ఆ కార్యానికి కారణం ఏమిటో చెప్పమంటున్నారు. ప్రతి కార్యానికీ కారణాన్ని వెదక్కుంటూ పోతే కారణం దొరక్కపోగా కార్యమే అస్తిత్వాన్ని కోల్పోయే ప్రమాదం ఉన్నది. మీ మేధ చాలా పదునైనదే కాని ఆ పదునెక్కువైతే స్వయంగా మేధయే తెగిపోవచ్చు.

ఈ పూటకు మన సంభాషణా ప్రవంతికి అడ్డువేసి భోజనం చేతాం, లేండి. ఇంతవరకు మనం చేస్తూ వచ్చిన అభౌతిక సంభాషణలు మనలోని భౌతిక సత్తాను తినివేసినాయి. కనుక ఇపుడు మనం భోజనం ద్వారా తిరిగి ఇదివరకటి భౌతిక సత్తాను చేపడితేనే కాని మనం మన ధోరణిని సాగించలేం.

అరటి ఆకులో వడ్డించారా భోజనం? నాకు చాలా ఇష్టం అరటి ఆకు భోజనం. అయితే అరిటిఆకులో శాకాహారం మాత్రమే బాగుంటుంది, మాంసాహారం మాత్రం ప్లేట్లలోనే బాగుంటుంది.

అదేమిటండోయి, మీరు శుద్ధ శాకాహారులు గదా మాంసం రుచి మీకేం తెలుసు?

అదా మీ సందేహం? తెలిసుకోటం అనేది ప్రధానంగా రెండు విధాలకు చెంది ఉంటుంది - ప్రత్యక్ష్యం, పరోక్షం. ఒకటి తన స్వానుభవం ద్వారా తెలుసుకోటం; రెండవది ఇతర్ల అనుభవం ద్వారా తెలుసుకోటం, ప్రత్యక్ష జ్ఞానం ఉత్తమమైంది, పరోక్షం దానికంటే ఒక క్రింది మెట్టుకు చెందుతుంది. ప్రత్యక్ష జ్ఞానం ప్రధానంగా దృశ్యమానం, పరోక్షం శ్రవ్య ప్రధానం. తాను తన కళ్లతో చూచి తెలుసుకోటం వేరు, ఇతర్లు చూచి చెప్పిన దాన్ని తన చెవులతో విని తెలుసుకోటం వేరు.

అంటే మాంసం రుచిని గురించి చెప్పిన మీ మాటలు పరోక్షానుభవానికి చెందినవి. మీరూ నేనూ కూడ మాంసభుక్కులం కాని మత్స్యభుక్కులం కాని కాకపోవటంతో మాంసానికి చెందిన రుచి మనకు పరోక్షమైంది మాత్రమే, ప్రత్యక్షానుభవానికి సుదూరమైంది.

మనం ఆహార సంబంధమైన చర్చలను అవతలకు నెట్టి ఆహారాన్ని మాత్రమే భుజిద్దాం. చర్చలను భుజిస్తే ఆకలి తీరక పోగా ఎక్కువవుతుంది కూడ. మాంసాహారం గొప్పదా శాకాహారం మంచిదా అనే వివాదాన్ని మనం ప్రస్తుతానికి నిషేధిద్దాం.

చర్చలు వద్దనుకుంటూనే ఉన్నాం, అయినా చర్చల్లో పడుతూనే ఉన్నాం. మనం కొంత జాగ్రత్తపడి చర్చల్లో పడకుండా ఉండటానికి ప్రయత్నిస్తున్నా కూడ చర్చలు తమంత తాము వచ్చి మనలో ప్రవేశిస్తున్నాయి. మనను మనం ఆపుకో కలుగుతున్నాం కాని వాటిని ఆపలేక పోతున్నాం.

నిజమేనండి, మనం ఏమి చేతాం. ఈ విషయంలో? మన ఉభయులలో ఒకరు తార్కికుడూ, మరొకరు తాత్వికుడూ అయినందున చర్చలకు దాసులం కాకుండా ఉండలేక పోతున్నాం. అయినా, అవి మనకు దాసులవుతూనే ఉన్నాయి. లోకం పోకడలు చిత్ర విచిత్రాలయినవి!

సరే, కానివ్వండి, భోజనం ప్రారంభించండి, కాలాతీతం అయిపోతూంది. అయినా, ఒక్క మాట చెప్పిన తరువాత భోజనం ప్రారంభిద్దాం. ఏమీ లేదు, ఒక చిన్న సందేహం, కొందరు విజ్ఞులంటారు భోజనానికి ముందు నీరు త్రాగటం మంచిది అని. మరికొందరంటారు, భోజనానికి ముందు నీరు త్రాగం మంచిది కాదని?

మీరు రెండు పద్ధతులు చెప్పేరు. ఈ రెంటికీ కారణాలు ఏమి చెపుతారో మీకేమైనా తెలుసా?

తెలుసు, భోజనానికి ముందు నీరు త్రాగినందువ సహజంగా ఎండుగా ఉన్న ప్రేగు

మెత్తపడి తినే ఆహారానికి మార్గం సులువు చేస్తుందని. మేలు చేయదు, కీడు చేస్తుందని చెప్పే వారి సిద్ధాంతం ఏమంటే జీర్ణకోశంలోకి ముందుగా నీరు ప్రవేశించినందున అక్కడున్న జీర్ణరసం పల్చబడిపోయి తిన్న పదార్థాన్ని జీర్ణింపచేయటంలో కొంత అడ్డంకు కలిగిస్తుందని. మీ దృష్టిలో ఏది ఎక్కువ సమంజసంగా ఉన్నట్లు తడుతుంది?

చెపుతాను వినండి. మొదటి వివరణ ఏమంటే శాస్త్రీయ వాస్తవాలు మన వైయక్తిక అభిప్రాయాల మీద ఏర్పడి ఉండటాలు కావు. అవి వస్తుగతమైన ఋజువుల మీద ఆధారపడి ఉంటాయి. వీటిలో మన ఇష్టాలు అయిష్టాలు పనికిరావు. భోజనానికి ముందు నీరు త్రాగటమా, త్రాగకపోవటమా అనే విషయాన్ని గురించి సరైన శాస్త్రీయమైన రుజువు నాకు తెలియదు. కనుక అది తెలిసేంతవరకు నీరు త్రాగడం త్రాగకపోవటం చేస్తుంటాను. త్రాగబుద్ధి అయినపుడు త్రాగటం, లేనపుడు మానేయటం చేస్తుంటాను.

సరే, అట్లాగే చేస్తూండండి. మన మాటల మధ్య అన్నమూ, కూరలూ చల్లబడటమూ మంచినీరు చల్లదనాన్ని పోగొట్టుకోటమూ జరుగుతుంది. కాబట్టి ఇక భోజనం చేతాము.

అయితే నన్నొక్క విషయం చెప్పనీయండి. అన్నం కూరలు, చల్లబడ్డా, త్రాగేనీరు వేడెక్కినా ఫరవాలేదు కాని పప్పుచారు మాత్రం చల్లబడకుండా ఉండాలి. మిగతావి చల్లని కూరలైనా తినవచ్చు కాని పప్పుచారు వేడిగా లేకపోతే తినలేం.

ఎన్నిసార్లయినా మాటలు చెప్పటం సరిపోతుంది కాని తినటం మాత్రం జరగటం లేదు. చూడండి, పప్పుచారు చల్లబడితే బాగుండదని అంటూనే పప్పుచారును చల్లపరిచారు. నిజానికి పప్పుచారులోని వేడిపోయిందే కాని ఇంకా చల్లబడలేదు. ఇప్పటికైనా అది చల్లబడి పోకముందే భోజనం ప్రారంభించండి.

అట్లాగే నండీ, నేను ప్రారంభిస్తున్నాను, మీరు ప్రారంభించండి. నేను ఆవకాయతో ప్రారంభించి పప్పుచారుతో అంతం చేయాలనుకున్నాను. కాని ఆవకాయను పూర్తిచేసే లోపల పప్పుచారు పూర్తిగా చల్లబడి పోతాయి కనుక నా భోజనాన్ని పప్పుచారుతో ప్రారంభించి ఆవకాయతో ముగిస్తాను, ఆవకాయకు చల్లబడే ప్రమాదం లేదు మరి.

సరే, అదే విధంగా కానీయండి. అదేమిటి, మీరు వయసులో నాకంటే చిన్నవారు కనుక నాకంటే ఎక్కువ తినాలసిందిపోయి నాకంటే తక్కువ తింటున్నారు?

ఇందులో విచిత్రం ఏమున్నది? మీరు పెద్దవారు కనుక పెద్ద పరిమాణంలో తింటున్నారు, నేను చిన్న వాడిని కనుక చిన్న పరిమాణంలో తింటున్నాను. అయినా, అన్నంలో ఏమున్నదండీ, ఉన్నదంతా కూరల్లోను పెరుగులోను ఉన్నది. మీరు అన్నం ఎక్కువ తిని కూరలూ పెరుగూ తక్కువ తింటున్నారు. నేను కూరలూ పెరుగూ ఎక్కువ తిని అన్నం తక్కువ తింటున్నాను. కనుక ఆహారం నేను ఎక్కువ తిన్నట్లు, మీరు తక్కువ తిన్నట్లూ అవుతుంది. నవ్వుతారెందుకు? నా మాటలు అబద్ధాలా?

Printed, Published and Edited by ALAPATI RAVINDRANATH at Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. X Roads, Musheerabad, Hyd-20. Ph. 612436, 612337.

**Editorial NEST**

Plot No. 337 A, Road No. 10, Jubilee Hills, Hyderabad-500 034. Ph. 247717



**The girl who played Manju in *Salaam Bombay* is still on the streets though having been allotted a flat five years ago**

MISIMI/ మిసిమి RNI Regd No.45042/90 Telugu Monthly Hyderabad-500 020

Postal Regd. No.H/SD/191


## “అన్ని బ్యాంకులకన్నా వడ్డీ మిన్న ఆప్కాబ్ అందించే పొదుపు పథకాలలో”

## 46 రోజులకు 11.25%

కాలపరిమితి ధరావతులపై ఆప్కాబ్ అందిస్తున్న వడ్డీరేట్లు
(01-3-1993 నుంచి అమలులో)

| కాలపరిమితి | వడ్డీరేటు |
|---|---|
| ★ 46 రోజుల నుండి 270 రోజుల వరకు | 11.25 |
| ★ 271 రోజుల నుండి 1 సం. లోపు | 11.00 |
| ★ ఒక సంవత్సరము ఆపైన | 11.25 |
| సేవింగ్స్ బ్యాంక్ ఖాతా | 6.25% |

ఆప్కాబ్‌లో ఉన్నాయి పెట్టుబడికి, పొదుపుకు అనేక పథకాలు. ★ గృహలక్ష్మి డిపాజిట్ స్కీమ్ ★ స్వర్ణఫల డిపాజిట్ స్కీమ్ ★ మారేజి డిపాజిట్ స్కీమ్ ★ హయ్యర్ ఎడ్యుకేషన్ డిపాజిట్ స్కీమ్ ★ క్యాష్ సర్టిఫికెట్ స్కీమ్ ★ బాలసహాయ డిపాజిట్ స్కీమ్ ★ రికరింగ్ డిపాజిట్ స్కీమ్ ★ పెన్షన్ డిపాజిట్ స్కీమ్ సేవింగ్స్ బ్యాంక్ అక్కౌంట్ ★ ఎన్.ఆర్.ఐ. (రు) మరియు ★ హోమ్‌లోన్ అక్కౌంట్.

APCOB

**ది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంకు లి॥.**

(షెడ్యూల్డ్ బ్యాంకు)
ట్రూప్ బజార్, హైదరాబాదు
ఫోన్: 44481, 44482, 44483

బ్రాంచీలు: విద్యానగర్ 615192 ★ మలక్‌పేట్ 528983 ★ నారాయణగూడ 664909 ★ విద్యుత్ సౌధ 220378 ★ సికింద్రాబాద్ 76172 ★ సైదాబాద్ కాలనీ 877401 ★ బౌద్ధనగర్ 865518 ★ హిమాయత్ నగర్ 232837 ★ తార్నాక 869351 ★ మాసాబ్‌టాంక్ 225451 ★ దిల్‌సుఖ్‌నగర్ 875539 ★ చార్మినార్ 524161 ★ బాగ్‌లింగంపల్లి 668944 ★ లోతుకుంట 845527 ★ తార్నాక బ్రాంచ్ ఎక్స్‌టెన్షన్ కౌంటర్ (ఎపిడిడిసియస్ ఆవరణలో) 869308 ★ తిరుపతి 22428.

**సదా మీ క్షేమాన్ని కాంక్షించే బ్యాంక్ ఆప్కాబ్**

(భారతీయ రిజర్వు బ్యాంకు వారి ఆదేశాల మేరకు అన్ని రేట్లు రివిజన్‌కు లోబడి ఉంటాయి.)